జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967, 7989694528

రంగారెడ్డి శనివారం 21 మార్చి 2026 సంపుటి : 1 సంచిక : 77 వెల: రూ.5 పేజీలు: 08 RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



## పక్కాగా పాత వాహనాల రీసైక్లింగ్

- దేశవ్యాప్తంగా 134 స్క్రాపింగ్ కేంద్రాలు
- పర్యావరణ పరిరక్షణకు కఠిన నిబంధనలు
- డిజిటల్ వ్యవస్థలు, పెట్టుబడులకు ప్రోత్సాహం
- వాహన యజమానులకు ప్రోత్సాహకాలు
- పర్యావరణ నిబంధనలు, భవిష్యత్ చర్యలు
- రాజ్యసభలో వెల్లడించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

3



## ఇరాన్‌పై భూతల దాడులు

- యుద్ధ రంగంలోకి యూఎస్ఎస్ ట్రిపోలి
- 2,000 మంది బలగాలతో పశ్చిమాసియావైపు వేగంగా కదులుతున్న భారీ యుద్ధ నౌక
- హెర్మూజ్ జలసంధిపై పట్టుకు అమెరికా వ్యూహం
- కీలకమైన ఖర్గ్ ఐలాండ్ స్వాధీనానికి సన్నాహాలు



## అధికార మార్పునకు కేరళ ప్రజలు సిద్ధం

- ఎన్నికల వేళ రాహుల్ గాంధీ
- త్వరలో కేరళలో అసెంబ్లీ ఎన్నికలు
- రాష్ట్ర ప్రజలనుద్దేశించి కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పోస్ట్
- అధికార మార్పునకు కేరళ ఓటర్లు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యలు

3

# సంక్షేమానికి నవోదయం


3

- తొమ్మిది కొత్త పథకాలకు శ్రీకారం
- మొత్తంగా ఆ రంగానికి రూ. 1,45,591 కోట్ల కేటాయింపు
- ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా
- ప్రతి ఒక్కరి హెల్త్‌ప్రొఫైల్‌తో డిజిటల్ కార్డు
- ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ఆరోగ్య భద్రత, ప్రమాద బీమా
- పేదల విద్యకు పెద్దపీట.. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు రూ. 5,000 కోట్లు
- గ్యారంటీ హామీల అమలుకు రూ.50,713 కోట్లు



హైదరాబాద్

సంక్షేమం, అభివృద్ధి పథకాల జోడు గుర్రాల సవారీకి కొత్త బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. నూతనంగా... తొమ్మిది సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టింది. ఇంతకాలం సంక్షేమం అంటే పేదలకే అనే భావన ఉండగా.. రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్యసేవలకు, జీవన భద్రతకు కట్టుబడి ఉన్నట్లు బడ్జెట్‌లో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందులో భాగంగానే తొలిసారి రాష్ట్ర జనాభా మొత్తానికి వర్తింపజేసే కొత్త పథకాన్ని ప్రకటించింది. పేద, ధనిక అనే తేడా లేకుండా జనాభా మొత్తానికి వర్తించే సంక్షేమ పథకం ఇటీవలి కాలంలో అమల్లోకి రావడం ఇదే ప్రథమం. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా - మిగతా2లో



## ఇప్పుడు జరుగుతున్న యుద్ధాన్ని భారత్ ఆపగలదు

- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్
- ప్రపంచంలో పెరుగుతున్న అస్థిరత, ఘర్షణల నేపథ్యంలో శాంతి కోసం ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయి
- ప్రస్తుతం అంతర్జాతీయ వ్యవహారాల్లో 'బలవంతుడిదే రాజ్యం' అనే నీతి నడుస్తోంది

## గ్యారంటీలకు ఘోరీ



- సీఎం, డిప్యూటీ సీఎంలపై హరీశ్‌రావు ఫైర్
- ఇది ప్రజలను నిరాశపరిచే బడ్జెట్
- వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్ల పెంపు ఊసే లేదు
- మహిళలకు ఇస్తామన్న రూ.2,500, నిరుద్యోగ భృతి
- రూ.4 వేల ప్రస్తావనే లేదు
- క్యూర్, ప్యూర్, రేర్ కాదు.. చోర్, గోల్‌మాల్ మోడల్ అన్న బీఆర్ఎస్ నేత



## ఆన్‌లైన్ జూదానికి చెక్

- మరో 300 యాప్‌లు, వెబ్‌సైట్లపై కేంద్రం వేటు
- 'ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ ఆఫ్ ఇండియా'ను కూడా ఏర్పాటు
- బ్లాక్ చేసిన వాటిలో ఆన్‌లైన్ స్పోర్ట్స్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లు, రౌలెట్, స్లాట్స్ వంటివి అందించే ఆన్‌లైన్ క్యాసినోలు, బెట్టింగ్ ఎక్స్ఛేంజ్‌లు

3

# రేషన్‌కార్డు ఉంటేనే కుటుంబ బీమా

- మూసీ ప్రక్షాళన తప్ప ప్రత్యామ్నాయం లేదు
- దేశస్థాయి ప్రమాణాలతో 10ం2 పద్ధతిలో విద్యా విధానం
- మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు యథాతథమే
- మండలాలు, జిల్లాల పునర్వ్యవస్థీకరణ ఇప్పట్లో లేదు
- అజహరుద్దీన్, కోదండరాం ఎమ్మెల్సీల ఫైల్ గవర్నర్ పరిశీలనలో
- చట్ట ప్రకారమే ఫార్ములా-ఈ, ఫోన్ ట్యాపింగ్ విచారణ
- రూ. 3.47 లక్షల కోట్లు అప్పులు తెచ్చాను..
- అందులో రూ. 3.30 లక్షల కోట్లు అప్పులు కట్టేందుకే



హైదరాబాద్

'కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదో నాకెలా తెలుస్తుంది. కొడుకు, కూతురు, అల్లుడు కలిసి గృహ నిర్బంధం చేశారేమో.. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అసెంబ్లీకి చెవుల్లో పువ్వులు పెట్టుకొని రావడం కాదు. వారిని వంగోబెట్టి వీపు మీద బండపెట్టాలి. ఊళ్లలో తప్పులు చేసినోళ్లకు బంజరుదొడ్డి కాడ అట్లనే చేసేవారు'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలో ఏ పదవిని ఎవరైనా అడగొచ్చని, మల్లికార్జునఖర్గే బ్లాక్ ప్రెసిడెంట్ నుంచి ఏఐసీసీ ప్రెసిడెంట్‌కు ఎదిగారని గుర్తు చేశారు. చిన్న పిల్లలను పెద్దయ్యాక ఏమవుతావని అడిగితే ఐఏఎస్, ఐపీఎస్ అవుతానని చెబుతారని, అలాగే తాను సీఎంగా ఉన్నాను కాబట్టి, మళ్లీ - మిగతా2లో

# సంక్షేమానికి నవోదయం

-మొదటిపేజీ తరువాయి
పథకాన్ని బడ్జెట్‌లో ప్రకటించడం ద్వారా అందరికీ ఇచ్చిన ప్రాధాన్యాన్ని చెప్పకనే చెప్పింది. చేయూత పథకానికి అర్హులైన వారికి 2 లక్షల నూతన పెన్షన్లను మంజూరు చేస్తామని వెల్లడించింది. కొత్తగా ప్రారంభించిన అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సంస్థ(ఏటీసీ)ల్లో చేరేవారికి నెలకు రూ.రెండువేల ఉపకార వేతనం ఇవ్వాలనే మరో కీలక పథకాన్ని ప్రకటించింది. దీనిద్వారా ఏటీసీల్లో ఎక్కువ మంది చేరేలా ఆకర్షించాలనేది ప్రభుత్వ లక్ష్యం.
ఈ సంస్థల్లో చేరినవారు... వృత్తి నైపుణ్యాలు సాధిస్తే వారికి ఉద్యోగాలు రావడం లేదా స్వయం ఉపాధి సంస్థల ఏర్పాటుతో జీవనోపాధికి అవసరమైన మార్గం కల్పించాలని ఈ కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఎంపిక చేసిన ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలలను అన్ని వనరులతో కూడిన తెలగాణ పబ్లిక్ స్కూళ్లుగా మార్పు చేయనున్నట్లు తెలిపింది. వాటిల్లో ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్య అందుతుందని వివరించింది. ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు నూతనంగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తామని వివరించింది. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రకటించింది. ప్రభుత్వ ఉద్యోగులు.. పెన్షనర్లు, వారి కుటుంబాలకు వైద్యసేవలను అందించే ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తామని పేర్కొంది. ఉద్యోగులు.. పెన్షనర్లకు ప్రమాద బీమా పథకం అమలు చేస్తామని తెలిపింది. రాష్ట్ర యువతకు వివిధ రంగాలలో తగిన నైపుణ్య శిక్షణ అందించడానికి.. వారికి ఉపాధి లభించిన దేశాల భాషను నేర్పించడానికి ఉద్దేశించిన సీఎం ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రామ్‌ను ప్రకటించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేస్తున్న యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్లకు ఏకంగా రూ. 5 వేల కోట్లు కేటాయించింది. పేదలకు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా వారి జీవితాల్లో అక్షర వెలుగులు నింపాలని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా తానే మంత్రిగా ఉన్న విద్యారంగానికి బడ్జెట్‌లో అత్యంత ప్రాధాన్యమిచ్చారు.

**మారుమూల పల్లెలు మొదలుకుని రాజధాని వరకు...**
రాష్ట్రవ్యాప్తంగా రవాణా సదుపాయాలను మెరుగుపరచాలని రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు భారీగా నిధులు కేటాయించింది. మూసీ కాలుష్యం నుంచి రాజధానివాసులకు విముక్తి కల్పించాలనే సంకల్పంతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం 'మూసీ రివర్‌ఫ్రంట్ పథకానికి' నిధులు కేటాయించింది. మెట్రో విస్తరణ రెండో దశ పనులకు బడ్జెట్‌లో తొలిసారి నిధుల కేటాయింపుతో నగర రవాణా వ్యవస్థ మెరుగుకు భరోసా దక్కింది. రాష్ట్ర ప్రజలందరికీ హెల్త్ ప్రొఫైల్‌తో డిజిటల్ హెల్త్ కార్డులను అందజేయాలని సర్కారు సంకల్పించింది.

**సంక్షేమ పథకాలకు 44.90 శాతం**
గత బడ్జెట్‌లో అన్ని రకాల సంక్షేమ పథకాలకు కలిపి రూ.1.04 లక్షల కోట్లు కేటాయిస్తే వచ్చే ఏడాదికి ఈ పద్దు కింద రూ.1,45,591 కోట్లను ప్రతిపాదించింది. మొత్తం బడ్జెట్ వ్యయంలో సంక్షేమ పథకాలకు కేటాయింపులు 44.90% కాగా.. గత బడ్జెట్‌లో ఇది 34.21 %. దీనిని 10%పైగా పెంచడం ద్వారా సంక్షేమ పథమే తమ ధ్యేయమని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో స్పష్టం చేసింది. మొత్తం 69 రకాల సంక్షేమ పథకాలను వివిధ శాఖల్లో అమలుచేస్తున్నారు.

**మూలధన వ్యయం పెంపుతో అభివృద్ధికి ప్రాధాన్యం**
మూలధన వ్యయ పద్దును ప్రభుత్వం రూ.36,504 కోట్ల నుంచి రూ.47,267 కోట్లకు భారీగా పెంచింది. ఏకంగా 29.40 శాతం పెంపును బడ్జెట్‌లో ప్రతిపాదించడం రాష్ట్ర అభివృద్ధికి ఉపకరిస్తుందని అంచనా. మొత్తం 28 ప్రభుత్వ శాఖల పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులకు వీటిని ఖర్చుచేయాలని ప్రతిపాదించారు. గ్యారంటీ హామీలకు సంబంధించిన సంక్షేమ పథకాలకు వచ్చే ఏడాదికి రూ.50,713 కోట్ల కేటాయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) కోసం గత బడ్జెట్‌లో వేసిన రూ.3.04 లక్షల కోట్ల అంచనాలకన్నా ఆదాయం రూ.23,626 కోట్లు తగ్గింది. దీనిప్రకారం సవరించిన అంచనాలతో ఈ ఏడాది బడ్జెట్ ఆదాయం రూ.2.81 లక్షల కోట్లకు తగ్గిపోయింది. అయినా ప్రభుత్వం మరిన్ని భారీ ఆదాయ లక్ష్యాలతో.. సుమారు రూ.43 వేల కోట్లు పెంచి రూ.3.24 లక్షల కోట్ల కొత్త బడ్జెట్‌ను రూపొందించింది. ఆదాయం పెరుగుతుందన్న నమ్మకంతోనే అంతే మొత్తం ఖర్చుచేస్తామని కొత్త బడ్జెట్‌లో ప్రభుత్వం స్పష్టం చేసింది.

**ఆదాయం... ఎందులో ఎంత పెరుగుతుందంటే...**
గత బడ్జెట్ అంచనాలకన్నా అదనంగా పెంచిన రూ.43 వేల కోట్ల బడ్జెట్ ఆదాయ అంచనాలలో ఏ పద్దు కింద ఎంత పెరుగుతుందనేది రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. పన్నులద్వారా రూ.14 వేల కోట్లు, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లలో రూ.13 వేల కోట్లు, పన్నేతర ఆదాయం రూ.6,412 కోట్లు, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా కింద రూ.3,710 కోట్లు, కొత్త రుణాలు రూ.5,325 కోట్లు అదనంగా వస్తాయని ప్రభుత్వం వివరించింది. ఈ అంచనాల ప్రకారమే పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు పెంచింది. కానీ ఆదాయం అదనంగా పెరుగుతుందని పెట్టుకున్న లక్ష్యాల్లో అన్నీ నెరవేరతాయా అనేది ఇప్పుడే చెప్పలేని పరిస్థితి. ఉదాహరణకు కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు వచ్చే ఏడాది అదనంగా రూ.13 వేల కోట్లు పెరుగుతాయని తెలిపింది. కానీ గత కొన్నేళ్లుగా ఈ పద్దు కింద కేంద్రం నుంచి బడ్జెట్‌లో పెట్టుకున్న అంచనా ప్రకారం నిధులు రాలేదు. కేంద్ర గ్రాంట్లుగా రూ.22,782.50 కోట్లు వస్తాయని గత బడ్జెట్‌లో అంచనా వేస్తే రూ.11,161 కోట్లే వచ్చినట్లు సవరణ పద్దు వివరించింది.

**కొత్త రుణాలే కీలకం...**
రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న మొత్తం ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్లు, పాత బాకీలపై వడ్డీలు, అసలు సొమ్ము కిస్తీల చెల్లింపులు, రెవెన్యూ ఖర్చులతో పోతున్నందున సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు కొత్తగా తీసుకునే రుణాలే కీలకంగా మారాయి. ప్రస్తుత ఏడాదిలో బహిరంగ మార్కెట్ నుంచి రూ.64,539 కోట్ల కొత్త రుణాలు తీసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నా రూ.67,539 కోట్లను సేకరించారు. ఇక వచ్చే ఏడాదికి బహిరంగ మార్కెట్ నుంచి రూ.73,383 కోట్లు, ఇతర మార్గాల్లో మరికొన్నికలిపి మొత్తం రూ.82,870 కోట్ల కొత్త రుణాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. వీటితో కలిపితేనే మొత్తం బడ్జెట్ ఆదాయం రూ.3.24 లక్షల కోట్లవుతుంది. కొత్త రుణాలను తీసుకోకపోతే అన్ని మార్గాల్లో వచ్చే ఆదాయం రూ.2.41 లక్షల కోట్లేనని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

**జీఎస్‌డీపీ పెరుగుదలతో కొత్త ఆశలు..**
ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలతో ఆర్థిక అస్థిరత నెలకొన్నా రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి(జీఎస్‌డీపీ) వృద్ధిరేటు గతేడాది 10.6 శాతముంటే ఈ ఏడాది 10.7 శాతానికి పెరగడం ఆశాజనకంగా భావిస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. జాతీయ సగటు వృద్ధిరేటు 9.8 నుంచి 8 శాతానికి పడిపోయినా రాష్ట్రానికి 10.7 శాతానికి పెరగడం ప్రభుత్వానికి ఊరటనిస్తోంది. జీఎస్‌డీపీ విలువ రూ.17.82 లక్షల కోట్లకు చేరింది. కొత్త రుణాల సేకరణకు జీఎస్‌డీపీ విలువ పెరుగుదల అత్యంత కీలకం. దీని ఆధారంగానే ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో తీసుకునే కొత్త రుణాలు ఈ ఏడాది సేకరించిన రూ.77,545.92 కోట్లకన్నా వచ్చే ఏడాది మరో రూ.5,325 కోట్లు అదనంగా వస్తాయని ప్రభుత్వం వివరించింది.

# రేషన్‌కార్డు ఉంటేనే కుటుంబ బీమా

-మొదటిపేజీ తరువాయి
వచ్చేసారి కూడా తానే సీఎంనని చెప్పినట్టు తెలిపారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత సీఎల్‌పీ సమావేశంలో మెజారిటీ ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకే సీఎంను ఎన్నుకుంటారని స్పష్టం చేశారు. శుక్రవారం శాసనమండలి కమిటీ హాల్‌లో ఆయన మీడియాతో 'చిట్‌చాట్'చేశారు. సీఎం వ్యాఖ్యల్లోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే....
పనోడిలా కేంద్రం నుంచి నిధులు తెప్పిస్తున్నా..: సీఎంగా కేంద్రం నుంచి నిధులు తేవడం కూడా ఓ పనే. నేను పాలకుడిని కాదు. సేవకుడిని. ప్రజలు ఐదేళ్ల కోసం ఓ పనోణ్ణి పెట్టుకున్నారు. గతంలో బాగా పనిచేస్తాడని పెట్టుకున్నాయన ఫాంహౌస్‌ల పడుకున్నందుకు ఆయన్ను మార్చారు. ఢిల్లీలో సీఎంకు కేంద్ర ప్రభుత్వం బంగ్లా ఎందుకిస్తుంది? గతంలో ఢిల్లీకి వెళ్లి రావాల్సిన నిధులు కూడా తెచ్చుకోలేదు. ఇప్పుడు అందుకు భిన్నంగా కేంద్ర ప్రాయోజిత పథకాల మీద దృష్టి పెట్టి సాధించుకుంటున్నాం. డీపీఆర్ సబ?మట్ చేస్తే కేంద్రం 25 శాతం నిధులు ఇస్తది. మూసీకి కేంద్రం ఆమోదం తెలపలేదని ఎవరన్నారు? కేంద్రం ఆమోదం తెలిపితేనే మూసీనది ప్రక్షాళనకు ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ రుణానికి ఒప్పుకుంది.
మూసీ ప్రక్షాళన ఆగదు: మూసీనది ప్రక్షాళన ఆగదు. మూసీ బఫర్‌జోన్‌లో అటు ఇటు 50 మీటర్ల చొప్పున తీసుకొని అభివృద్ధి చేయాలి. 55 కిలోమీటర్ల మూసీ ప్రక్షాళన ప్రాజెక్టులో డిసెంబర్ 2024లో కన్సల్టెన్సీని అపాయింట్ చేస్తే 21 కిలోమీటర్లకు సంబంధించి లంగర్‌హౌస్ వరకు డీపీఆర్ రిపోర్టు ఇచ్చింది. అభివృద్ధి చేసే క్రమంలో ప్రజలకు జరిగే నష్టాన్ని ఎలా పూడ్చాలనేది చూడాలి. ఈ విషయంలో సూచనలు, సలహాలు ఇవ్వమని అడిగినం. పబ్లిక్ డొమైన్‌లో పెట్టినం.

**రేషన్‌కార్డు ఉంటేనే...**
రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు బీమా కల్పించాలని ప్రభుత్వం సంకల్పించింది. అయితే రేషన్‌కార్డు కలిగిన కుటుంబాలకే రూ.5 లక్షల కుటుంబబీమా అమలు చేస్తాం. ప్రస్తుతం వ్యవసాయ భూమి కలిగిన రైతులకు కల్పిస్తున్న రూ.5 లక్షల బీమా సదుపాయాన్ని రేషన్‌కార్డు కలిగిన కుటుంబాలకు ఇస్తాం. అప్పుడు రైతుబీమా కూడా అందులోకే వస్తుంది. కుటుంబ ఆర్థిక స్తోమత నిర్ధారణకు రేషన్‌కార్డు ఒక్కటే కొలమానం.

**తెలంగాణ విద్యావిధానంలో సంస్కరణలు**
తెలంగాణ విద్యావిధానంలో మార్పులు తీసుకొస్తున్నాం. అందుకోసం దేశవ్యాప్తంగా అమలవుతున్న 10 ప్లస్ 2 విధానాన్ని తీసుకురావాల్సిన అవసరముంది. ఈ మేరకు విద్యాకమిషన్ ఇచ్చిన నివేదికను కె.కేశవరావు నేతృత్వంలోని ఓ కమిటీకి అప్పగించాం. ఈ కమిటీకి అభ్యంతరాలు, సూచనలు ఇస్తే, తుది నివేదిక ఇస్తుంది. దాన్ని అమలు చేసే బాధ్యత నాది.



**రూ.3.30 లక్షల కోట్ల పాత అప్పులు చెల్లించాం**
మేం అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 డిసెంబర్ 1 నుంచి 2026 ఫిబ్రవరి 28 వరకు రూ.3.47 లక్షల కోట్లు అప్పుగా తెచ్చాం. అందులో రూ.3.30 లక్షల కోట్లు కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీ కింద చెల్లించాం. ఇందులో రూ.44 వేల కోట్లు కాళేశ్వరం కోసం చేసిన అప్పులు చెల్లించాం. చేసిన మొత్తం అప్పుల్లో కేవలం రూ. 17 వేల కోట్లను మాత్రమే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాం.

**చట్టపరంగానే విచారణ**
ఫార్ములా--ఈ రేస్, ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ కేస్ ఏదైనా చట్టప్రకారంగానే విచారణ జరుగుతుంది. ప్రభాకర్‌రావు 20 నెలలు ఇండియాలోనే లేడు. ఆయన వచ్చిన తర్వాత జరిపిన విచారణలో ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటున్నాయి. ఆరువేల ఫోన్లు ట్యాప్ అయినట్టు తేలింది. అందులో భాగంగానే స్టేట్‌మెంట్లు రికార్డు చేస్తున్నారు. ఫోన్‌టాపింగ్ కేసులో క్లీన్‌చిట్ ఇచ్చినట్టు హరీశ్‌రావు చెబుతుండడం తప్పు. చక్రధర్‌గౌడ్ పంజగుట్ట పీఎస్‌లో తనను హరీశ్‌రావు బెదిరించాడని చేసిన ఫిర్యాదుకు సంబంధించిన కేసు అది. హరీశ్‌రావు బెదిరించినట్టు చక్రధర్‌గౌడ్ నిరూపించలేనందున కేసును కొట్టేశారు. దీనికి ఫోన్‌ట్యాపింగ్ కేసుకు ఏ సంబంధం లేదు. టెలిఫోన్ టాపింగ్ కేసులో ఇంకా హరీశ్‌రావు విచారణనే జరగలేదు. ఈ కేసులో నా ఫోన్‌లు ట్యాప్ అయినట్టు విచారణాధికారులు నిర్ధారించి విచారణకు పిలిస్తే నేను కూడా వెళతా.

**హిల్ట్ పాలసీపై ఏ విచారణ కోరినా ఆదేశాలిస్తా**
హిల్ట్ పాలసీలో రూ.5 లక్షల కోట్లు అవినీతి జరిగిందని బీఆర్ఎస్ నేతలు రోజుకోమాట మాట్లాడుతున్నారు. హిల్ట్ కింద 9 వేల ఎకరాలు లే అవుట్ చేసినా, అక్కరకొచ్చేది 4 వేల ఎకరాలే. 1970 నుంచి పరిశ్రమల కోసం ఇచ్చిన భూములను వారు ఎప్పుడో సొంతం చేసుకున్నారు. భూ బదలాయింపులకు సంబంధించి డబ్బులు కట్టి ఇండ్రస్టియల్ జోన్ నుంచి మల్టీ జోన్‌కు మార్చుకునేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దాని మీద అర్థం పర్థం లేకుండా మాట్లాడుతున్నారు. మొత్తం 9 వేల ఎకరాల భూములను హిల్ట్ పాలసీలో అమ్మినా లక్ష కోట్లు రావు కాదు.

**మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు ఆపే ఉద్దేశం లేదు**
మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలు ఆపే ఉద్దేశం ప్రభుత్వానికి లేదు. జనాభా లెక్కల్లో అధికార యంత్రాంగం బిజీగా ఉండడంతో ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని ఆగాం. ఇక కొత్తగా హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్ కార్పొరేషన్ల ఏర్పాటుకు జనాభా లెక్కలకు సంబంధం లేదు. జీహెచ్ఎంసీలో ఓఆర్ఆర్ లోపలి మునిసిపాలిటీలు, గ్రామాల విలీన ప్రక్రియ, కొత్తగా 300 డివిజన్ల ఏర్పాటు అనేది గత డిసెంబర్ నాటికే పూర్తయింది. మండలాలు, జిల్లాల పునర్విభజన ప్రక్రియ ఇప్పుడు ఉండదు. జనాభా లెక్కలు పూర్తయి, నియోజకవర్గాల పునర్విభజన అయిన తర్వాత ఏఏ మండలాలు, గ్రామాలు ఏఏ రెవెన్యూ డివిజన్లు, జిల్లాల పరిధిలోకి వెళ్లాయో తేలిన తర్వాతే రిటైర్డ్ జడ్జితో కమిటీ ఏర్పాటు చేసి, లోపాలను సరిదిద్దుతాం.

**భూముల విక్రయానికి కాంగ్రెస్ వ్యతిరేకం కాదు**
రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం ప్రభుత్వ భూములను విక్రయించాల్సి వస్తే అందుకు కాంగ్రెస్ ఏనాడూ అభ్యంతరం చెప్పలేదు. భూముల విక్రయం ద్వారా వచ్చిన డబ్బులను దుర?వనియోగం చేసినప్పుడే కాంగ్రెస్ వ్యతిరేకించింది. మూల ధన వ్యయం కోసం భూములు విక్రయించగా వచ్చిన సొమ్మును వాడుకోవచ్చు. ప్రభుత్వ భూములు, రెవెన్యూ, టీజీఐఐసీ, హిల్ట్ పాలసీ మొదలైన ఏ భూములనైనా అవసరానికి అనుగుణంగా విక్రయించొచ్చు.

**బీఆర్ఎస్, బీజేపీ వేర్వేరు కాదు**
రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ వేర్వేరు కాదు. నేను బీఆర్ఎస్‌ను విమర్శిస్తే బీజేపీ బండి సంజయ్ స్పందిస్తాడు. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన డ్రగ్స్, ఫాంహౌస్‌లో పోలీసులపై కాల్పులకు సంబంధించి బీజేపీ నాయకులు ఎక్కడైనా స్పందించారా? ఇంత పెద్ద సంఘటన జరిగినప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ మాట్లాడొద్దా?. జీవన్‌రెడ్డి విషయాన్ని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ చూసుకుంటారు. ఆపరేషన్ కగార్ కేంద్రానికి సంబంధించినది. రాష్ట్ర పరిధిలోకి రాదు. ఎమ్మెల్సీగా ఎన్నిక కావడానికి మంత్రి అజాహరుద్దీన్ ఉన్న గడువు ఏప్రిల్ 30. ఏప్రిల్ 29 వరకు కూడా ఆయన ఎమ్మెల్సీగా రావొచ్చు. అజాహరుద్దీన్, కోదండరాంకు సంబంధించిన ఎమ్మెల్సీల ఫైల్ గవర్నర్ పరిశీలనలో ఉంది.

## గ్యారంటీలకు ఘోరీ

హైదరాబాద్
ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఘోరీ కట్టారని బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉప నేత హరీశ్‌రావు విమర్శించారు. ఇది దగాకోరు, ప్రజలను తీవ్రంగా నిరాశపరిచే బడ్జెట్ అని అన్నారు. వృద్ధాప్య, దివ్యాంగుల పింఛను పెంపు ఊసే లేదని, మహిళలకు ఇస్తామన్న రూ.2,500 ప్రస్తావన కానీ, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ.4 వేల గురించిన కనీస ఊసు కానీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీల్లో కొన్ని అమలు చేస్తూ అందులోనూ గత బడ్జెట్‌తో పోలిస్తే కోతలు పెట్టారన్నారు. ఆరు గ్యారంటీల విషయంలో గతేడాది రూ.56 వేల కోట్లు పెడితే, ఈ బడ్జెట్‌లో రూ.50 వేల కోట్లకు కుదించారని పేర్కొన్నారు. కొత్త పింఛన్లు కాదు ఉన్న పింఛన్లు ఊడగొడుతున్నారని ధ్వజమెత్తారు. 3 లక్షల పింఛన్లు తొలగించి, 2 లక్షల కొత్త పింఛన్లు ఇస్తామంటున్నారని విమర్శించారు. 18 ఏళ్లు పైబడిన విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. శుక్రవారం ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత బీఆర్ఎస్ఎల్‌పీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, కేపీ వివేకానంద, సంజయ్, పల్లా రాజేశ్వరరెడ్డి, చింతా ప్రభాకర్‌లతో కలిసి హరీశ్‌రావు విలేకరులతో మాట్లాడారు.

**20 పేజీలు, రూ.20 వేల కోట్లు పెంచారు తప్ప..**
'బడ్జెట్ ప్రసంగాన్ని 20 పేజీలు, బడ్జెట్‌ను రూ.20 వేల కోట్లు పెంచారే తప్ప.. ఆరు గ్యారెంటీల ఊసెత్తలేదు. నిధుల కేటాయింపు చేయలేదు. కాగితాల మీద అంకెలు ఉన్నాయి తప్ప.. ప్రజల కష్టాలు తీర్చడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. గత బడ్జెట్‌లో చెప్పిన పథకాలు అమలు చేయలేదు. మళ్లీ అవే పథకాలు వల్లవేశారు. గత బడ్జెట్‌లోనే రాజీవ్ యువ వికాసం పథకానికి రూ.6 వేల కోట్లు కేటాయించారు కానీ పైసా విడుదల చేయలేదు. మళ్లీ ఈసారి బడ్జెట్‌లో అంతే మొత్తాన్ని ప్రతిపాదించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా విషయంలోనూ అదే జరిగింది. ఇందిరమ్మ, రాజీవ్‌గాంధీల పేర్లు చెప్పివారి ఆత్మ క్షోభించేలా చేస్తున్నారు..'అని హరీశ్‌రావు విమర్శించారు.

**మూడు ముక్కలు చేయడం తప్ప..**
'తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్ పేరిట, హైదరాబాద్ కార్పొరేషన్‌ను మూడు కార్పొరేషన్లుగా మూడు ముక్కలు చేయడం తప్ప చేసిందేమీ లేదు. క్యూర్, ప్యూర్, రేర్ కాదు.. చోర్ మోడల్, గోల్‌మాల్ మోడల్. బడ్జెట్ అంతా బోగస్. అభయహస్తం కాదు రిక్త హస్తమని ప్రజలకు అర్థమైంది. పింఛన్ల పెంపు ఎప్పుడా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. పదవీ విరమణ ఉద్యోగులకు ప్రయోజనాలు లేవు. అన్ని కులాలకు, వర్గాలకు మొండిచేయి చూపారు.

**మూడేళ్లు కాకుండానే రూ.3.5 లక్షల కోట్ల అప్పులు**
మూడేళ్లు నిండకముందే రూ.మూడున్నర లక్షల కోట్ల అప్పులు చేశారు. అంత అప్పు చేసి ఒక్క రూపాయితో ఒక్క ప్రాజెక్టు అయినా నిర్మించారా? కేసీఆర్ కాళేశ్వరం కట్టారు. మిషన్ భగీరథ అమలు చేశారు. మెడికల్ కాలేజీలు కట్టించారు. కేసీఆర్ తాను తెచ్చిన అప్పులను మూలధన పెట్టుబడిగా మార్చి సంపద సృష్టించారు. మీరు వచ్చాక చరిత్రలో ఎన్నడూ లేనంతగా అప్పు పెరిగింది. 27 శాతం నుంచి 29 శాతానికి పెంచారు..'అని బీఆర్ఎస్ నేత విమర్శించారు.

**ఫిరాయింపు ఎమ్మెల్యేలను కూర్చోబెట్టుకుని..**
'ఫిరాయింపు ఎమ్మెల్యేలను కూర్చోబెట్టుకుని అంబేద్కర్ సూక్తులు మాట్లాడటం సిగ్గుచేటు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని బూడిద నుంచి ఫీనిక్స్ పక్షిలాగా ఎగిరింప చేసింది. ఆ ఫీనిక్స్ పక్షిని బూడిద చేసిన పాపం మీది. స్కాంలు తప్ప స్కీంలు ఉన్నాయా? మేడారం టెండర్లలో ఏం జరిగిందో మీ కేబినెట్ మంత్రి కుమార్తెనే చెప్పారు. నాసిరకం పనులతో నాలుగు రోజులకే భాగోతం బయటపడింది. ఇండస్ట్రియల్ హబ్ కాదు.. కరప్షన్ హబ్‌గా మార్చారు. సింగరేణిని స్కాంల ఖనిగా, కుంభకోణాల కేంద్రంగా మార్చారు. గురుకులాల్లో తిండి పెట్టే దిక్కు లేదు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్కూళ్ల అంటూ ఆర్భాటాలు చేస్తున్నారు. మీ పాలనలో 167 మంది గురుకుల పిల్లలు చనిపోయారు.

**పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలి**
ఏ కంపెనీ, ఎన్ని ఉద్యోగాలు, ఎంత పెట్టుబడులు అనే దానిపై శ్వేతపత్రం విడుదల చేయాలి. మీరు విదేశాలకు వెళ్లింది పెట్టుబడుల కోసం కాదు అక్రమ సంపాదన భద్రపరుచుకోవడానికి. డిప్యూటీ సీఎం భట్టి దేశ సగటు కన్నా తెలంగాణ జీఎస్డీపీ అధికంగా ఉందని అంటుంటే.. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రం దివాళా తీసింది అంటున్నారు. ఇందులో ఏది నిజం? దేశం కంటే తెలంగాణ తలసరి ఆదాయం 1.9 శాతం ఎక్కువ అంటున్నారు. కానీ బీఆర్ఎస్ పాలనలో 14 శాతం ఉంటే, కాంగ్రెస్ పాలనలో 10 శాతం మాత్రమే. మా పాలనలో జీఎస్డీపీ వృద్ధి రేటు 12.5 శాతం ఉంటే, కాంగ్రెస్ పాలనలో 10.7 శాతానికి తగ్గింది.

**పాలనలో ఫెయిల్**
మీరు పాలనలో ఫెయిల్ అయ్యారు. హైడ్రా కూల్చివేతలు, మీ మూర్ఖత్వం వల్ల అభివృద్ధి ఆగిపోయింది. గతేడాది యాసంగిలో సన్నరకం వడ్లకు రూ.వెయ్యి కోట్లు ఎగ్గొట్టారు. భూముల మీద ఉన్న ప్రేమ ప్రజల మీద లేదు. కూల్చడం మీద ఉన్న ప్రేమ నిర్మాణం మీద లేదు. మేము నోటిఫికేషన్లు ఇస్తే.. నియామక పత్రాలు ఇచ్చి ఆ ఉద్యోగాలు మీరే ఇచ్చినట్లు చెబుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 6 లక్షల రేషన్‌కార్డులు ఇచ్చినట్లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెబితే..భట్టి ఇవ్వలేదంటున్నారు..'అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

**మహాలక్ష్మిలో రూ.2,800 కోట్లు బకాయి**
'మహాలక్ష్మి కింద ప్రభుత్వం రూ.2,800 కోట్లు బకాయి పడింది. ఆర?టసీకి రూ.9,222 కోట్లు ఇస్తే సంస్థ రూ.3 వేల కోట్ల అప్పులు ఎందుకు చేసింది? ఆర్టీసీ లాభాల్లో ఉంటే పింఛన్ బకాయిలు ఎందుకు ఇవ్వడం లేదు? ఎందుకు కార?మకులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదు?..'అని మాజీమంత్రి నిలదీశారు.

## రాయలేని వారికి వరం..
## నగదు చెల్లింపులు సులభం

హైదరాబాద్
దృష్టి లోపం ఉన్న విద్యార్థులు ఇతరుల సాయం లేకుండా పరీక్షలు రాసే పరిజ్ఞానం.. డిజిటల్ చెల్లింపుల ప్రక్రియను మరింత సరళం చేసే కొత్త విధానం.. ఇలాంటి ఎన్నో సరికొత్త సాంకేతికతలను సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్(సీ-డాక్) అభివృద్ధి చేసింది. హైదరాబాద్‌లోని ఐఐసీటీలో ఇటీవల జరిగిన 39వ వ్యవస్థాపక దినోత్సవంలో ఈ సాంకేతికతలను ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ సమక్షంలో ఆవిష్కరించారు. పరిశోధకులు వాటి పనితీరును 'ఈనాడు'కు వివరించారు.

**చెబుతుంటే పరీక్ష రాసే 'హై-రైటర్'**
సాధారణంగా దృష్టిలోపం ఉన్నవారు, చేతులతో రాయలేని విద్యార్థులు పరీక్షల సమయంలో మరొక వ్యక్తి సాయం తీసుకోవాల్సి ఉంటుంది. ఏఐ ఆధారితంగా రూపొందించిన 'హై-రైటర్' ఎవరి సాయం లేకుండానే వారు చెబుతుంటే వాయిస్ ద్వారా గ్రహించి పరీక్ష రాస్తుంది. విద్యార్థులు చెప్పే సమాధానాలను స్పీచ్ టూ టెక్స్ట్ వ్యవస్థ గుర్తిస్తుంది. వాటిని కచ్చితత్వంతో సమాధానాలుగా మారుస్తుంది. కంప్యూటర్ తెరపై ఉన్న ప్రశ్నలను ఈ సాఫ్ట్‌వేర్ విద్యార్థికి చదివి వినిపిస్తుంది. ఇది ఆంగ్లంతోపాటు అన్ని ప్రాంతీయ భాషల్లో పనిచేస్తుంది. పైప్‌లైన్ల ద్వారా సరఫరా అయ్యే గ్యాస్ వినియోగాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంది. ఎంత గ్యాస్ వాడుతున్నారో వినియోగదారులు మొబైల్ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. బిల్లింగ్‌లో పారదర్శకత, గ్యాస్ లీకేజీలను గుర్తించి ప్రమాదాల నివారణకు ఇది ఉపయోగపడుతుందని పరిశోధకులు తెలిపారు. పే సేతు.. ఇది కేవలం పేమెంట్ గేట్‌వే మాత్రమే కాదు.. బహుళ గేట్‌వేలు, వివిధ బ్యాంకుల ద్వారా జరిగే ఆర్థిక లావాదేవీలను ఒకేచోటు నుంచి నిర్వహించేందుకు వీలు కల్పిస్తుంది. చెల్లింపులను సులువుగా ట్రాక్ చేసేందుకు దోహదపడుతుంది.

# ఇరాన్‌పై భూతల దాడులు

న్యూఢిల్లీ

పశ్చిమాసియా యుద్ధ రంగంలోకి మరో భారీ యుద్ధనౌక అడుగుపెడుతున్నది. ఉత్తర అరేబియా సముద్రంలో యుద్ధ క్షేత్రంలోకి 2,000 మంది నావికులతో అమెరికా యుద్ధ విమానాల వాహకనౌక యూఎస్ఎస్ ట్రిపోలి వచ్చేవారం ప్రవేశించనున్నది. 50,000 టన్నుల బరువైన ఈ నౌక ప్రవేశంతో ప్రస్తుతం కొనసాగుతున్న అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం భవిష్యత్తు తేలిపోతుంది. ప్రస్తుతం దక్షిణ హిందూ మహాసముద్రంలో శ్రీలంకకు దక్షిణం వైపున ఉన్న ట్రిపోలి గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో మోహరించి ఉన్న యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌కు మరింత బలం చేకూర్చనున్నది. 844 అడుగుల పొడవుండే యూఎస్ఎస్ ట్రిపోలిపైన ఎఫ్-35, ఎంవీ-22 అస్ప్రీ, ఎంహెచ్60ఎస్ సీహాక్ హెలికాప్టర్లు ఉంటాయి. మార్చి 22-23 తేదీల్లో ఈ నౌక యుద్ధ క్షేత్రంలోకి ప్రవేశించే అవకాశం ఉంది.



**గ్రౌండ్ ఆపరేషన్‌కు సన్నద్ధం..**

ఇరాన్‌పై భూతల యుద్ధానికి అమెరికా సన్నద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో వీటికి బలం చేకూర్చేలా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం విలేకరుల సమావేశంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సైనిక బలగాలను తాను ఎక్కడా మోహరించలేదని, ఒకవేళ ఆ పని చేయాల్సి వస్తే కచ్చితంగా మీకు చెప్పబోనని ట్రంప్ విలేకరులతో అన్నారు. అయితే అసహనానికి గురవుతున్న ట్రంప్ వేలాది సైనిక బలగాలను ఇరాన్‌లోకి దింపే అవకాశం ఉందని అమెరికా భద్రతాధికారులు రాయిటర్స్ వార్తాసంస్థకు తెలిపారు. ఇందుకు ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి హెర్మూజ్ జలసంధిని తిరిగి తెరిపించాల్సిన అవసరం ఉండడం. ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి హెర్మూజ్ జలసంధిని పూర్తిగా మూసివేసి నౌకల రవాణాను ఇరాన్ అడ్డుకుంటున్నది. రెండు భారత్, పాకిస్థాన్ సహా పరిమిత సంఖ్యలో కొన్ని చమురు ట్యాంకర్లను జలసంధి గుండా ప్రయాణించడానికి అనుమతిస్తున్న ఇరాన్ పశ్చిమ దేశాలకు చెందిన నౌకలను పేల్చివేస్తామని హెచ్చరిస్తున్నది. హెర్మూజ్‌పై తన పట్టును నిలుపుకుంటున్న ఇరాన్.. జలసంధి గుండా ప్రయాణించే నౌకలపై టోల్ ఫీజు వసూలు చేయడం ప్రారంభించింది. సురక్షితంగా బయటపడేందుకు 20 లక్షల డాలర్ల(రూ. 18 కోట్లు) టోల్ ఫీజు చెల్లించినట్లు ఓ చమురు ట్యాంకర్ నిర్వాహకుడు చెప్పినట్లు ఓ పత్రిక తెలిపింది. గత కొన్ని రోజులుగా ట్రంప్ హెర్మూజ్‌కు తమ యుద్ధ నౌకలను పంపాలని తన మిత్ర దేశాలపై ఒత్తిడి తెచ్చారు. అయితే దీనికి ఏ దేశమూ సానుకూలంగా స్పందించలేదు. దీంతో హెర్మూజ్‌ను తెరిపించడానికి నావికాదళ బలగాలతో తన యుద్ధ నౌక యూఎస్ఎస్ ట్రిపోలిని అక్కడికి పంపిస్తుండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేగాక ఇరాన్‌కు దక్షిణ కోస్తా సమీపంలో ఉన్న ఒకటి రెండు ద్వీపాలను స్వాధీనం చేసుకునేందుకు ట్రంప్ ట్రిపోలిలోని బలగాలను ఉపయోగించవచ్చని మరి కొందరు అమెరికా ప్రభుత్వ అధికారులు అంచనా వేశారు. వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు జరుపకుండా అడ్డుకునేందుకు ఈ ద్వీపాలను ట్రంప్ వాడుకునే అవకాశం ఉందని వారు చెప్పారు.

**ఖర్గ్ ద్వీపంలో యురేనియం నిల్వలు**

ఇరాన్‌కు ఆర్థిక జీవనాడిగా, 90 శాతం చమురు ఎగుమతులు జరిగేందుకు దోహదపడుతున్న ఖర్గ్ ద్వీపానికి కొన్ని సైనిక బలగాలను ట్రంప్ పంపించే అవకాశం ఉంది. ఈ ద్వీపానికి ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని దీన్ని నాశనం చేయడం కన్నా దీన్ని తన ఆధీనంలోనే ఉంచుకోవడానికి ట్రంప్ ఇష్టపడవచ్చని అధికారులు చెప్పారు. హెర్మూజ్‌లో నౌకాయాన ట్రాఫిక్‌ను పునరుద్ధరించేందుకు అక్కడ బలగాలను మోహరించే విషయాన్ని ట్రంప్ పరిశీలించాలని భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ ఇటీవల సూచించారు. అయితే అణ్వస్త్రాలను తయారుచేసేందుకు ఇరాన్ ఉపయోగించడానికి అవకాశం ఉన్న 950 పౌండ్ల శుద్ధి చేసిన యురేనియంను స్వాధీనం చేసుకునేందుకు ట్రంప్ అమెరికా బలగాలను ఇరాన్ భూతలంపై పాదం మోపేందుకు అనుమతిస్తారన్న ప్రచారం కూడా జరుగుతున్నది. అమెరికా, ఇజ్రాయెల్ ధ్వంసం చేసిన సదుపాయాల శిథిలాల కింద ఈ యురేనియం ఉండవచ్చని, దీన్ని వెలికితీసేందుకు భూతల సైనిక బలగాలు అవసరమని అధికారులు చెప్పారు. ఇదిలా ఉండగా ట్రంప్, జపాన్ ప్రధాని తకైచీ గురువారం రహస్య చర్చలు జరిపారు. హెర్మూజ్‌పై ఇరాన్ ఆంక్షలను తొలగించాలని జపాన్ డిమాండు చేస్తున్న నేపథ్యంలో వీరిద్దరి చర్చలకు ప్రాధాన్యం ఏర్పడింది.

## పక్కాగా పాత వాహనాల రీసైక్లింగ్

న్యూఢిల్లీ

దేశంలో పాత, పనికిరాని వాహనాల (ఎండ్ ఆఫ్ లైఫ్ వెహికల్స్--ఈఎల్‌వీఎస్) రీసైక్లింగ్‌ను పర్యావరణానికి అనుకూలంగా, సురక్షితంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు కేంద్ర రోడ్డు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కారీ తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకమైన పటిష్ట వ్యవస్థను రూపొందించినట్లు ఇటీవల ఓ ప్రశ్నకు సమాధానంగా రాజ్యసభలో చెప్పారు. అనధికార రంగం నుంచి వ్యవస్థీకృత రంగానికి మార్పులో భాగంగా దేశంలో పాత వాహనాల స్క్రాపింగ్ ఇప్పటివరకు ప్రధానంగా అనధికార రంగంలో జరుగుతోందన్నారు. దీనిని నియంత్రిత వ్యవస్థలోకి తీసుకురావడానికి ప్రభుత్వం 'వాహన స్క్రాపింగ్ పాలసీ'(వాలంటరీ వెహికల్ ఫ్లీట్ మోడరైజేషన్ ప్రోగ్రాం--వీ--వీఎంపీ) అమలు చేస్తోందన్నారు. దీనికి అనుగుణంగా 2021లో మోటార్ వాహనాల (వాహన స్క్రాపింగ్ సౌకర్యాల నమోదు మరియు విధులు) నిబంధనలు రూపొందించి, అనంతరం పలు సవరణలు చేసిందన్నారు. 2026 మార్చి 10 నాటికి దేశంలోని 22 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో మొత్తం 134 రిజిస్టర్డ్ వాహన స్క్రాపింగ్ కేంద్రాలు పనిచేస్తున్నాయి.

**ఏటా ఆడిటింగ్**

అనధికారికంగా వాహనాల విభజన వల్ల కలిగే పర్యావరణ నష్టాలపై ప్రత్యేక అధ్యయనం జరగనప్పటికీ, ఆర్‌వీఎస్ఎఫ్ఎస్‌లో పర్యావరణ భద్రతకు కఠిన ప్రమాణాలు అమలు చేస్తున్నారు. ప్రధానంగా 'కలుతాలు లీక్ కాకుండా ప్రత్యేక డీ--పొల్యూషన్ పరికరాలు, ఆయిల్, బ్యాటరీలు, గ్యాస్ వంటి హానికర పదార్థాల వేరు నిల్వ, ఎఫ్లుయెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, నీటి రీసైక్లింగ్ వ్యవస్థలు, భద్రతా ప్రమాణాలు, శబ్ద కాలుష్య నియంత్రణ వంటివి ఉన్నాయన్నారు. అదనంగా ఏటా ఆడిట్‌తో స్క్రాపింగ్ కేంద్రాల పనితీరును అంచనా వేస్తున్నట్లు వివరించారు.

**ఆన్‌లైన్ దరఖాస్తు సౌకర్యం**

స్క్రాపింగ్ కేంద్రాల ఏర్పాటుకు నేషనల్ సింగిల్ విండో సిస్టమ్ (ఎన్ఎస్‌డబ్ల్యూఎస్) ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు సౌకర్యం కల్?పంచినట్లు పేర్కొన్నారు. అలాగే నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ అభివృద్ధి చేసిన 'వ?రస్కాప్'మాడ్యూల్ ద్వారా వాహనాల స్క్రాపింగ్ ప్రక్రియను ఆన్‌లైన్ చేసినట్లు వెల్లడించారు. పాత ప్రభుత్వ వాహనాల వేలం కోసం 'ఎంఎస్‌టీసీ', 'జీఈఎం'పోర్టల్స్ ఉపయోగిస్తున్నారు. రాష్ట్రాలకు ప్రోత్సాహంగా 2025--26లో ప్రత్యేక సహాయం పథకం కింద రూ.2వేల కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

**పలు రాయితీలు**

స్క్రాపింగ్ కేంద్రాల్లో వాహనాలను సమర్పించే వారికి ప్రభుత్వం రాయితీలు అందిస్తోందన్నారు. ప్రధానంగా.. 'కొత్త వాహన నమోదు ఫీజు మినహాయింపు, మోటార్ వాహన పన్నులో 15శాతం నుంచి 25శాతం వరకు రాయితీ, పాత బీఎస్--1, బీఎస్--2 వాహనాల మార్?పడిపై 50శాతం వరకు పన్ను తగ్గింపు'అని వివరించారు. ప్రస్తుతం ఉన్న 134 ఆర్‌వీఎస్ఎఫ్ఎస్ ద్వారా సంవత్సరానికి సగటున 10వేల నుంచి 12వేల వాహనాలను స్క్రాప్ చేసే సామర్థ్యం ఉందన్నారు. ఇప్పటివరకు 4,60,979 వాహనాలు స్క్రాప్ చేయగా, ఇందులో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే 2,79,792 వాహనాలు స్క్రాప్ చేసినట్లు తెలిపారు.

**ఈపీఆర్ విధానం**

పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా 2025లో 'ఎండ్ ఆఫ్ లైఫ్ వెహికల్స్ రూల్స్'కేంద్ర పర్యావరణ శాఖ ప్రకటించిందన్నారు. ఇందులో వాహన తయారీదారులకు ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబిలిటీ (ఈపీఆర్) విధానం అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, కాలుష్య నియంత్రణ మండలి-- 2023 మార్గదర్శకాల ద్వారా పాత వాహనాల విభజన, రీసైక్లింగ్ ప్రక్రియను సురక్షితంగా నిర్వహించే విధానాలను నిర్దేశించిందన్నారు. దేశంలో పాత వాహనాల రీసైక్లింగ్‌ను పర్యావరణ అనుకూల, సాంకేతికంగా అభివృద్ధి చెందిన వ్యవస్థగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి గడ్కారీ స్పష్టం చేశారు.

## అధికార మార్పునకు కేరళ ప్రజలు సిద్ధం

మరికొద్ది రోజుల్లో కేరళలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. కేరళ ప్రజలు అధికార మార్పునకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో యూడీఎఫ్ (కాంగ్రెస్ కూటమి) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. "యూడీఎఫ్ కూటమి తరఫున ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి కేరళం ప్రజల గొంతుకను, ఆకాంక్షలను, నమ్మకాన్ని ప్రతిబింబిస్తున్నారు. ఈ కూటమి అనుభవజ్ఞులైన నాయకులు, మార్పు తేవాలనే యువకుల కలయిక. నాకు కేరళం ఇల్లు. కేరళ ప్రజలు కుటుంబ సభ్యులు. కేరళ ప్రజలు నాపై చూపిన ప్రేమ, ఆప్యాయతలకు వారికి నేను ఎంతో రుణపడి ఉంటాను. నేను ఎల్లప్పుడూ ప్రజల భాగస్వామిగా ఉంటాను. కేరళం నుంచి వస్తున్న సందేశం స్పష్టం. రాబోయే శాసనసభ ఎన్నికల్లో ప్రజలు మార్పునకు సిద్ధంగా ఉన్నారు. ప్రజల మాట వినే, వారిని అర్థం చేసుకునే, నిజాయితీతో పనిచేసే ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు. రాబోయే యూడీఎఫ్ ప్రభుత్వంతో కలిసి ఈ అందమైన రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తును నిర్మించడానికి నేను చేయగలిగినదంతా చేస్తాను. కేరళం గెలుస్తుంది- అందుకు యూడీఎఫ్ నాయకత్వం వహిస్తుంది."

**ఇక నుంచి ఆ విధానం పనిచేయదు : శశిథరూర్**

కేరళ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రముఖ వార్తాసంస్థ పీటీఐకి కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ ఇంటర్వ్యూ ఇచ్చారు. కేరళలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం రాష్ట్రాన్ని విదేశాల నుంచి వచ్చే నగదు, లాటరీలు, మద్యంపై ఆధారపడేలా చేస్తోందని శశిథరూర్ ఆరోపించారు. ఇక నుంచి ఈ విధానం పనిచేయదని మండిపడ్డారు. కేరళలో జరగబోయే ఎన్నికల కోసం కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ప్రణాళిక, ఎల్‌డీఎఫ్ పదేళ్ల పాలనపై ఉన్న వ్యతిరేకత కంటే చాలా సానుకూలంగా ఉందని తెలిపారు. కేరళలో అధికారంలో ఉన్న లెఫ్ట్ ప్రభుత్వం అసమర్థంగా వ్యవహరిస్తోందని శశిథరూర్ విమర్శించారు. ప్రతి ఏడాది సెప్టెంబర్ నాటికే రాష్ట్ర ప్రభుత్వం వద్ద డబ్బులు అయిపోతున్నాయని, ఆ తర్వాత ఉద్యోగులకు జీతాలు చెల్లించడానికి ప్రభుత్వం అప్పు చేయాల్సి వస్తోందని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో పినరయి విజయన్ ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రజలకు చూపిం చడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన ధ్యేయమా అని అడగ్గా, థరూర్ తనదైన శైలిలో సమా ధానం ఇచ్చారు. తమ పార్టీ ధ్యేయం చాలా సానుకూలమైనదని భావిస్తున్నానని తెలిపారు. అది కేరళ 2.0కి సంబంధించినదని వివరించారు. "యూడీఎఫ్ పార్టీ మేనిఫెస్టో ఇంకా వెలువడలేదు. అయితే రాష్ట్రంలో వ్యాపారాలకు అనుకూల వాతావరణాన్ని కల్పించాలనేది తాను ప్రతిపాదిస్తున్న ఐడియాల్లో ఒకటి. కేరళ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది. ప్రభుత్వం చేసిన తప్పులన్నింటికీ సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, పెన్షన్ వంటి ఐదు నిర్దిష్ట హామీలను ప్రజలకు ఇచ్చాం. విదేశాల నుంచి వచ్చే డబ్బు, లాటరీలు, మద్యం రాష్ట్రాన్ని నడిపిస్తున్నాయి. రాష్ట్ర అభివృద్ధి కోసం చేపట్టే ప్రాజెక్టుల కోసం చేసే ఖర్చు కంటే అప్పుల చెల్లింపులు, వాటిపై వడ్డీలు, జీతాలు, పెన్షన్ల కోసమే కేరళ సర్కార్ ఎక్కువ డబ్బు ఖర్చు చేస్తోంది. దేశంలో అత్యధిక పన్నులు చెల్లిస్తున్నది కేరళ వాసులే. అత్యధిక ఆస్తి పన్ను, అత్యధిక స్టాంప్ డ్యూటీ కడుతున్నారు. నా దగ్గర చాలా ఆలోచనలు ఉన్నాయి. కాంగ్రెస్-యూడీఎఫ్‌ల దగ్గర కూడా ఇంతవరకు ప్రయత్నించని కొత్త విషయాల కోసం చాలా ఐడియాలు ఉన్నాయి. "

**బీజేపీపై కీలక వ్యాఖ్యలు**

త్వరలో కేరళలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఒక నామమాత్రపు పార్టీగానే మిగిలిపోతుందని శశిథరూర్ జోస్యం చెప్పారు. ఈ ఎన్నికల్లో పోటీ ప్రధానంగా ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ మధ్యనే ఉంటుందన్నారు. "కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో త్రిముఖ పోరు ఉండదు. ఎందుకంటే అసెంబ్లీలో బీజేపీకి ప్రస్తుతం ఉన్న సీట్లు సున్నా. సున్నా నుంచి ఒకటి, రెండు లేదా మూడు సీట్లకు వెళితే వారు (బీజేపీ నేతలు) చాలా గర్వంగా, సంతోషంగా ఉంటారు. గొప్ప విజయం సాధించామని తమను తాము అభినందించు కుంటారు. బీజేపీ ప్రస్తుతం అలాంటి పరిస్థితిలోనే ఉంది" అని శశిథరూర్ పేర్కొన్నారు.

## ఆన్‌లైన్ జూదానికి చెక్...

ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ యాప్‌లపై కేంద్ర ప్రభుత్వం తన ఉక్కుపాదాన్ని కొనసాగిస్తోంది. దేశవ్యాప్తంగా అక్రమంగా కార్యకలాపాలు సాగిస్తున్న మరో 300 గ్యాంబ్లింగ్, బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్‌లను తాజాగా బ్లాక్ చేసింది. దీంతో ఇప్పటివరకు బ్లాక్ చేసిన వాటి సంఖ్య 8,400కు చేరిందని ప్రభుత్వ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. బ్లాక్ చేసిన వాటిలో ఆన్‌లైన్ స్పోర్ట్స్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లు, రౌలెట్, స్లాట్స్ వంటివి అందించే ఆన్‌లైన్ క్యాసినోలు, బెట్టింగ్ ఎక్స్ఛేంజ్‌లు ఉన్నాయి. వీటితో పాటు సట్టా/మట్కా నెట్‌వర్క్‌లు, నిజమైన డబ్బుతో ఆడే కార్డ్ గేమ్ యాప్‌లు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. గతేడాది ఆగస్టులో పార్లమెంట్ ఆమోదించిన 'ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్, 2025' కింద ఈ చర్యలు తీసుకుంటున్నారు. 2025 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన ఈ కొత్త చట్టం తర్వాతే సుమారు 4,900 వెబ్‌సైట్లను బ్లాక్ చేయడం గమనార్హం. ఈ చట్టం ప్రకారం... పోకర్, రమ్మీ, ఫాంటసీ స్పోర్ట్స్ వంటి నిజమైన డబ్బుతో కూడిన గేమ్‌లను అందిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష, భారీ జరిమానాలు విధిస్తారు. ఈ పరిశ్రమను నియంత్రించేందుకు 'ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ ఆఫ్ ఇండియా'ను కూడా ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌ల వల్ల ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోవడం, యువత వ్యసనాలకు బానిసలు కావడం, కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యలకు పాల్పడటం వంటి ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన చర్యలు చేపట్టింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) కూడా 'గేమింగ్ డిజార్డర్'ను ఒక ఆరోగ్య సమస్యగా గుర్తించింది. అయితే, ఈ చట్టం అన్ని ఆన్‌లైన్ గేమ్‌లను వ్యతిరేకించడం లేదు. ఈ-స్పోర్ట్స్, సురక్షితమైన సోషల్, ఎడ్యుకేషనల్ గేమ్‌లను ప్రోత్సహిస్తోంది. లాభాల ఆశ చూపి వినియోగదారులను దోపిడీ చేసే బెట్టింగ్, గ్యాంబ్లింగ్ గేమ్‌లకు, నైపుణ్యాన్ని పెంచే గేమ్‌లకు మధ్య స్పష్టమైన తేడాను ఈ చట్టం చూపిస్తోంది.

## ఇప్పుడు జరుగుతున్న యుద్ధాన్ని భారత్ ఆపగలదు

ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాన్ని ఆపగల సత్తా ఒక్క భారత్‌కే ఉందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. నాగ్‌పూర్‌లో శుక్రవారం జరిగిన విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) విదర్భ ప్రాంత కార్యాలయ భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో పెరుగుతున్న అస్థిరత, ఘర్షణల నేపథ్యంలో శాంతి కోసం ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ వ్యవహారాల్లో 'బలవంతుడిదే రాజ్యం' అనే నీతి నడుస్తోందని, ఇది భారతీయ విలువలైన మానవతా ధర్మానికి పూర్తి విరుద్ధమని భగవత్ విమర్శించారు. ధర్మ పునాదులతో ప్రపంచంలో సమతుల్యతను పునరుద్ధరించే బాధ్యత భారత్‌పై ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో శాంతిని నెలకొల్పే సామర్థ్యం భారత్‌కు మాత్రమే ఉందని ఇప్పుడు ప్రపంచం గుర్తిస్తోందని తెలిపారు. గత 2,000 ఏళ్లుగా అనేక సిద్ధాంతాలు ప్రపంచానికి శాశ్వత శాంతిని అందించడంలో విఫలమయ్యాయని, ఎందుకంటే వాటిలో ఐక్యతా భావన లోపించిందని భగవత్ విశ్లేషించారు. స్వార్థ ప్రయోజనాలు, ఆధిపత్య కాంక్షే ఆధునిక ఘర్షణలకు ప్రధాన కారణాలని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ పాత్ర పోషించడానికి ముందు దేశం అంతర్గతంగా బలంగా మారాలని భగవత్ పిలుపునిచ్చారు. "సత్యం మన వైపు ఉన్నా, మనం బలహీనంగా ఉంటే ప్రపంచం మనల్ని గౌరవించదు" అని ఆయన స్పష్టం చేశారు. దేశంలోని అంతర్గత విభేదాలను తొలగించుకుని, సమాజం ఐక్యంగా మారాలన్నారు. ప్రపంచంలో సామరస్యాన్ని వ్యాప్తి చేసే తన కర్తవ్యాన్ని నెరవేర్చడానికి భారత్ సిద్ధమైనప్పుడు, దేశ ఆర్థిక, భౌతిక పురోగతి దానంతట అదే సాధ్యమవుతుందని భగవత్ ఉద్ఘాటించారు.

# ఆందోళనతో ఎల్‌పీజీ బుకింగ్స్ చేసుకోవడం తగ్గిపోయింది

ప్రజలు ఆందోళనతో ఎల్‌పీజీ వంటగ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకోవడం తగ్గిపోయిందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ వెల్లడించింది. గురువారం రోజు కేవలం 55 లక్షల ఎల్‌పీజీ సిలిండర్లనే బుక్ చేసుకున్నారని తెలిపింది. శుక్రవారం కేంద్ర మంత్రిత్వ శాఖల సంయుక్త విలేకరుల సమావేశంలో ఈవివరాలను పెట్రోలియం, సహజ వాయువు శాఖ జాయింట్ సెక్రెటరీ సుజాత శర్మ చెప్పారు. దేశవ్యాప్తంగా ఎల్‌పీజీ వంటగ్యాస్ సిలిండర్ల సప్లైలో ఎలాంటి కొరతా లేదని ఆమె తేల్చి చెప్పారు. భారతదేశ అవసరాలకు సరిపడా ఎల్‌పీజీ వంటగ్యాస్ నిల్వలు ఉన్నాయని, ఏ ఒక్క వంటగ్యాస్ సప్లై ఏజెన్సీలోనూ స్టాక్ అయిపోవడం అనేది జరగలేదన్నారు. అయితే ఇప్పటికీ ఎల్‌పీజీ అంశం కొంత ఆందోళనకరంగానే ఉందని సుజాత శర్మ పేర్కొన్నారు.

**గతవారం 11,300 టన్నుల కమర్షియల్ సిలిండర్ల సప్లై**

"పశ్చిమాసియా యుద్ధం మొదలు కావడానికి ముందు దేశంలో రోజూ సగటున 50 లక్షల నుంచి 55 లక్షల ఎల్‌పీజీ వంటగ్యాస్ సిలిండర్లు బుక్ అయ్యేవి. వంటగ్యాస్ కొరత ఏర్పడుతుందనే ఆందోళనతో ప్రజలు మార్చి 13న ఏకంగా 87.7 లక్షల సిలిండర్లను బుక్ చేసుకున్నారు. కానీ ఈవిధమైన ప్యానిక్ బుకింగ్ తగ్గిపోయి, గురువారం నాటికి 55 లక్షలకు చేరింది. గత రెండువారాల వ్యవధిలో దేశంలో ఎల్‌పీజీ వంటగ్యాస్ ఉత్పత్తిని 40 శాతానికిపైగా పెంచాం. పశ్చిమాసియా యుద్ధం మొదలైన తొలినాళ్లలో వాణిజ్య సిలిండర్ల సప్లైను కొన్నిరోజులు ఆపాం. కానీ ఆ తర్వాత వాణిజ్య సిలిండర్ల కస్టమర్ల గ్యాస్ అవసరాలను ఐదోవంతు మేర తీర్చడం మొదలుపెట్టాం. గతవారం రోజుల వ్యవధిలో వాణిజ్య సిలిండర్ల కస్టమర్లకు 11,300 టన్నుల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్లను సప్లై చేశాం. ఈనేపథ్యంలో దేశంలోని 15 ప్రాంతాల్లో 13,700 మంది కొత్తగా పీఎన్‌జీ పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్లు తీసుకున్నారు. మరో 7వేల మంది వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల కస్టమర్లు కూడా పీఎన్‌జీ గ్యాస్ కనెక్షన్లకు మారిపోయారు" అని సుజాత శర్మ వెల్లడించారు.

**ప్రీమియం కేటగిరీ పెట్రోలు ధరల పెంపు**

"ఎల్‌పీజీ సిలిండర్ల కొనుగోలుకు డోర్ డెలివరీ సిస్టమ్ లాంటి సరైన మార్గాలనే కస్టమర్లు అనుసరించాలి. ప్రీమియం కేటగిరీ పెట్రోలు ధరలు మాత్రమే పెరిగాయి. ఈమేరకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నిర్ణయాన్ని తీసుకున్నాయి. సాధారణ పెట్రోలు, డీజిల్ ధరలు మారలేదు" అని సుజాత శర్మ స్పష్టం చేశారు.

**ఒక్కరోజే దేశవ్యాప్తంగా 4,500 సోదాలు**

"ప్రస్తుత పరిస్థితుల్లో గ్యాస్‌ను వినియోగించే కస్టమర్ల వైఖరిలో చాలా మార్పు వచ్చింది. 7.5 లక్షల మంది ఎల్‌పీజీ యూజర్లు పీఎన్‌జీ పైప్డ్ గ్యాస్‌కు మారిపోయారు. ఇంధన సప్లైలను పర్యవేక్షించేందుకు దేశవ్యాప్తంగా పర్యవేక్షణా యంత్రాంగాలను బలోపేతం చేశాం. 32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కంట్రోల్ రూంలు, జిల్లా మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఇంధన సరఫరాలో అవకతవకలను అడ్డుకునేందుకు కఠినమైన చర్యలను తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా గురువారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా 4,500 సోదాలు నిర్వహించారు. ఒక్క ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోనే 1100 రైడ్స్ చేశారు. దేశంలోని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీ) 1800 ఆకస్మిక తనిఖీలను నిర్వహించాయి" అని పెట్రోలియం, సహజ వాయువు శాఖ జాయింట్ సెక్రెటరీ సుజాత శర్మ తెలిపారు.

**చమురు, ఎల్‌పీజీ సప్లైలకు ఆ మినహాయింపు**

ఎల్‌పీజీ వంటగ్యాస్, ముడి చమురు సప్లైలకు ఊరటనిచ్చే చర్యలను చేపడుతున్నట్లు కేంద్ర నౌకాయాన శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా తెలిపారు. ఇందులో భాగంగా ముడి చమురు, ఎల్‌పీజీ సప్లైలకు మార్చి 14 నుంచి 31 వరకు గ్రౌండ్ ఛార్జీలు, రీఫర్ ఛార్జీల నుంచి మినహాయింపును కల్పిస్తూ న్యూ మంగళూర్ పోర్టు నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు.

**గల్ఫ్‌లో ఆరుగురు భారతీయుల మృతి : విదేశాంగ శాఖ**

పశ్చిమాసియా యుద్ధం వల్ల గల్ఫ్ దేశాల్లో ఇప్పటివరకు ఆరుగురు భారతీయులు చనిపోగా, ఒకరి ఆచూకీ గల్లంతైందని విదేశాంగ శాఖ అదనపు కార్యదర్శి (గల్ఫ్) అసీమ్ ఆర్ మహాజన్ శుక్రవారం వెల్లడించారు. చనిపోయిన భారతీయుల భౌతిక కాయాలను వీలైనంత త్వరగా దేశానికి తీసుకొచ్చేందుకు, ఆయా దేశాల అధికార వర్గాలతో అక్కడి భారత ఎంబసీలు సమన్వయం చేసుకుంటున్నాయని ఆయన తెలిపారు. ఆచూకీ గల్లంతైన భారతీయుడిని గుర్తించే దిశగానూ ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సౌదీ అరేబియా, ఒమన్, ఇరాక్, యూఏఈలలోని భారత ఎంబసీలు ఈ అంశాలపై పూర్తి ఫోకస్ పెట్టాయని అసీమ్ ఆర్ మహాజన్ చెప్పారు.

**3 లక్షల మంది భారతీయులు తిరిగొచ్చేశారు**

గల్ఫ్ దేశాల నుంచి విమాన సర్వీసులు క్రమంగా పెరుగుతున్నాయని, పెద్దసంఖ్యలో భారతీయులు అక్కడి నుంచి స్వదేశానికి వస్తున్నారన్నారు. ఫిబ్రవరి 28న పశ్చిమాసియా సైనిక ఘర్షణ మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు 3 లక్షల మంది భారతీయులు గల్ఫ్ దేశాల నుంచి వచ్చేశారని ఆయన పేర్కొన్నారు. కానీ ఇప్పటికీ యూఏఈ నుంచి భద్రతా పరిస్థితుల ప్రాతిపదికన పరిమిత స్థాయిలోనే నాన్ షెడ్యూల్డ్ విమాన సర్వీసులను నడుపుతున్నారని అసీమ్ ఆర్ మహాజన్ తెలిపారు. శుక్రవారం రోజు దాదాపు 90 విమానాలు యూఏఈలోని వివిధ ఎయిర్‌పోర్టుల నుంచి భారత్‌కు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇక ఒమన్, సౌదీ అరేబియాల నుంచి భారత్‌కు విమాన సర్వీసులు కొనసాగుతున్నాయని, ఖతర్ గగనతలం పాక్షికంగా తెరుచుకుందని పేర్కొన్నారు. శుక్రవారం రోజు భారత్‌కు 10 నాన్ షెడ్యూల్డ్ విమాన సర్వీసులను ఖతర్ ఎయిర్‌వేస్ నడిపే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు.

**తెరుచుకోని కువైట్, బహ్రెయిన్ గగనతలాలు**

ఇప్పటికీ కువైట్, బహ్రెయిన్ గగనతలాలు మూసివేసి ఉన్నాయన్నారు. కువైట్ ఎయిర్ వేస్ సౌదీ అరేబియాలోని అల్ ఖైసుమా హఫర్ అల్ బాతిన్ ఎయిర్‌పోర్టు నుంచి భారత్‌లోని కొచ్చికి శుక్రవారం తొలి విమాన సర్వీసును నడిపే అవకాశం ఉందని అసీమ్ ఆర్ మహాజన్ తెలిపారు.

# సంపాదకీయం

## ఉచితాలు అవసరమా, అనివార్యమా?

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రభుత్వాలు బాధ్యతారాహిత్యంగా ఉచితాలు ప్రకటించడంపట్ల దేశ అత్యున్నత న్యాయస్థానం ఇటీవల రాష్ట్రాలను తీవ్రంగా హెచ్చరించింది. అటువంటి నిర్ణయాలు ప్రకటించే సమయాన్ని, ఆర్థిక తర్కాన్ని ప్రశ్నించింది. అవసరమైనవన్నీ ఉచితంగా ఇచ్చుకుంటూ పోతే ప్రజలు ఎందుకు పనిచేయాలి? అన్ని ఉచితంగా వస్తుంటే వాళ్ళు పనిచేయడం ఎక్కడి నుంచి నేర్చుకుంటారు? ఎన్నాళ్లీ ఉచితాల అమలు? ఇదేనా మనం చేసే జాతి నిర్మాణం? రాష్ట్ర ప్రభుత్వాలన్నీ దాదాపుగా రెవెన్యూ లోటు లోనే ఉన్నా, ఈ పథకాల అమలుకు డబ్బు ఎక్కడి నుంచి తెస్తున్నాయంటూ సుప్రీం ధర్మాసనం తమిళనాడు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కేంద్రం కొత్తగా ప్రతిపాదించిన విద్యుత్ సవరణ నిబంధనలు 2024 లోని రూల్ 23ను సవాలు చేస్తూ తమిళనాడు విద్యుత్ పంపిణీ సంస్థ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం ప్రధాన న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు రాష్ట్రానికి సంబంధించిన ఈ కేసులో సుప్రీం కోర్టు దాదాపుగా దేశంలోని అన్ని రాష్ట్రాలను హెచ్చరించినట్లేనని స్పష్టం అవుతుంది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ఈ కేసును ఉద్ఘాటిస్తూ.. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడం మంచిదే. కానీ దానికి మూల్యం ఎవరు చెల్లించాలి? ఈ పథకాల అమలు కోసం ప్రభుత్వానికి డబ్బు ఎక్కడి నుండి వస్తుంది. అదంతా పన్ను చెల్లింపుదారులదే కదా? అంటూ అన్ని రాష్ట్రాలకు చురకలంటిచ్చినట్లు చీఫ్ జస్టిస్ వ్యాఖ్యలు ఉన్నాయి. ప్రస్తుతం రాజకీయ పార్టీల మేనిఫెస్టోపై చర్చ అనవసరం. సంక్షేమం, ఉచితాలు రెండు విభిన్న దృక్పథాలు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం ప్రభుత్వాల బాధ్యత. కానీ, రాజకీయ పార్టీలు సంక్షేమం ముసుగులో ప్రజల ఆశలను ఆసరాగా చేసుకుని ప్రజలను ప్రసన్నం చేసుకోవడానికి ఉచితాలు ప్రకటిస్తున్నాయి. అధికారమే లక్ష్యంగా అందలం ఎక్కేందుకు తొలుత తమ తలతాకట్టు పెట్టైనా హామీలను మీ గడపలకు చేరుస్తామని ప్రగల్భాలు పలికి అనంతరం ఆశతో అధికారమిచ్చిన ప్రజల తలపైనే చేతులు పెడుతున్న తీరును నేటి ప్రభుత్వాల్లో గమనిస్తున్నాం. ఒక నిర్దిష్టమైన ఆర్థిక విధానం అంటూ లేకుండా, అయితే అప్పులు చేస్తూ, లేకపోతే ధరలు పెంచుతూ ప్రజలను నయవంచనకు గురి చేస్తున్నాయి. ఉచితాల అంశాన్ని తెర మీదికి రావడానికి కారణమైన తమిళనాడు రాష్ట్రంలో ఇటీవల 100 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని యోచిస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సవరణ నిబంధనలు- 2024 లోని నిబంధన 23 మేరకు ఇబ్బందులు వస్తాయనే ఉద్దేశంతో తమిళనాడు విద్యుత్ పంపిణీ కార్పొరేషన్ పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో సుప్రీం కోర్టు 100 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రస్తావిస్తూ.. నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని, ఈ భారం ప్రభుత్వం స్వీకరించడం ఎంత వరకు ప్రజా ప్రయోజనం, విద్యుత్ బిల్లు చెల్లించే శక్తి ఉన్నవారికి, లేనివారికి మధ్య ప్రామాణికం ఏంటి? సంక్షేమ రాజ్యంగా అణగారిన వర్గాలు, అవసరమైన వారికి సాయం చేయడాన్ని ఎవరైనా అంగీకరించాల్సిందే. దాన్ని సమాజం కూడా అదే రీతిలో స్వాగతించాలి. కానీ కొందరు వ్యక్తులు అన్ని ఉండి కూడా తమ పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వం అమలుచేసే పథకాలు, ఉచితాలు తమ జేబుకే చేరాలనుకునేవారు సమాజంలో అనేక మంది ఉండడమే ఆందోళన కలిగించే విషయం. తెలంగాణ రాష్ట్రంలో కూడా 200 వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నరు. రాష్ట్రంలోని కొన్ని లక్షల కుటుంబాలకు ఉపశమనం కలిగించే విషయమే. ప్రభుత్వం బాధ్యతగా భరోసాను కల్పించే పథకమే ప్రవేశపెట్టింది. కానీ ఏ స్థాయిలో ఈ పథకం ఉపయోగపడుతుందో అదే స్థాయిలో బిల్లు కట్టే స్థోమత ఉన్నవారికి కూడా అందించడం అసలు పథకం సార్థకతను ప్రశ్నించే విధంగా ఉందన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పునఃసమీక్షించాల్సిన అవసరాన్ని సుప్రీం కోర్టు స్పష్టం చేస్తోంది. వాస్తవానికి ఉచిత పథకాలు సమాజానికి ప్రమాదమే. ఎప్పుడు ప్రమాదం అంటే అన్నీ ఉన్నవారికి కూడా ఇచ్చినప్పుడు, కడుపునిండా తినే స్థోమత ఉన్నవాడికి ఇచ్చినప్పుడు, ఈ ఉచితాలు తప్పక నిరుపయోగమే. కానీ బొక్కలుతేలి ఆకలిని అలవాటుగా మార్చుకుని తన దైనందిన జీవితాన్ని తప్పక కొనసాగిస్తున్న పేదవానికి ఉచితం అందితే అది తప్పక అమృతం అవుతుందే కానీ విషం కాదు. మన తెలంగాణ రైతాంగం అంటేనే రాష్ట్రం ఏర్పడే నాటికి ఒక రకమైన అభిప్రాయం అప్పుల ఊబిలు, ఉరికొయ్యలు, పురుగుల మందు డబ్బాలు, - బీడు భూములు, కరెంటు కోతలు, అడుగంటిన బోరుబావులు ఇది ఒక్క మాటలో చెప్పాలంటే మన రైతుల సమగ్ర స్వరూపం. ఏదిఏమైనా రాష్ట్రం ఏర్పడ్డాక పెట్టుబడికి రైతుబంధు డబ్బులు మాత్రం ఒక గొప్ప ధీమాను కల్పించాయని చెప్పడానికి ఒక్కటా రెండా అనేక జీవితాలు నిలువెత్తు నిదర్శనంగా నిలబడి ఉన్నాయి. ఈ పథకం సైతం అమలు విషయంలో దుర్వినియోగం అయింది. ఇప్పటివరకు రైతులకు నష్టం కంటే లాభం ఎక్కువగా చేసిన పథకం ఏదైనా ఉంది అంటే అది ఇదే. రాష్ట్రంలో లక్షలాది మంది వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు ఆసరా పింఛన్ల పథకంతో ప్రతి నెల ఆర్థిక సహాయం అందించడం ప్రభుత్వానికి ఎలాంటి ప్రయోజనం చేకూర్చకపోయినా ఆయా వర్గాలను ఆత్మవిశ్వాసంతో బతకడానికి అవసరమైన ధీమాను ఈ పథకం కల్పించింది. రాజ్యం ఇదొక మానవీయ పథకంగా భావించాలే తప్ప ఉచితంగా పరిగణించవద్దు. పెద్దపెద్ద పారిశ్రామిక కుటుంబాలకు వేలకోట్ల రూపాయల రుణాలను రైట్ ఆఫ్ చేసిన దేశ పాలకులు సైతం ఉచిత పథకాలను విమర్శిస్తున్నారు. తమకు అందని ఉచిత పథకం ఏదైనా వృథానే అనిపించడం మామూలే. అతి ఎప్పుడైనా కొంపకు చేటే అన్నట్లు అనవసరమైన ఉచితం వ్యవస్థ ఉనికికే ముప్పు. ఈ సందర్భంగా మనందరం గుండెల మీద చేయి వేసుకుని ఆలోచించాల్సిన ఒక విషయం ఏంటంటే ఉచిత హామీల అమలు కోసం ఎంత మొత్తంలో ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్నాయి. అందుకు నిధుల సమీకరణ ఎలా జరుగుతుంది అన్న ప్రశ్నలు సంధించుకుని మనకు మనమే సమాధానం చెప్పుకుంటే తప్ప మనకు మనం తెలుసుకోలేం. అర్థం కాదు కూడా ఈ ఉచితాల ముసుగు. సుప్రీం తీర్పు నేపథ్యంలో ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొని, ఉచితాలతో ప్రజలను భ్రమల్లోకి నెట్టకుండా, వారి జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకువచ్చే దిశగా ప్రణాళికలు రూపొందించాలి.

# అటవీ సంరక్షణ సామాజిక బాధ్యత



ప్రపంచ అటవీ దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 21 న నిర్వహించ బడుతుంది. 2012 లో ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం ప్రకటించినప్పటి నుండి, ప్రపంచ దేశాలు అన్ని రకాల చెట్లు అడవుల ప్రాముఖ్యతపై అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. 2012, నవంబరు 28న యునెస్కో వారిచే తీర్మానించబడిన ప్రపంచ అటవీ దినోత్సవం, 2013 మార్చి 21న తొలిసారిగా నిర్వహించ బడింది. మానవుల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక మరియు పర్యావరణ అభివృద్ధికి అడవులు ఎంతో అవసరమని తెల్పడం ప్రపంచ అటవీ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం. ప్రస్తుత, ముందు తరాల వారికి అడవుల ప్రాముఖ్యత, ప్రయోజనాలను తెలియ జేయడం కోసం ఈ దినోత్సవం రోజున వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు.మానవాళి మనుగడకు అడవులు సోపానాలు. మన జీవావరణ సంపదలు. ఇవి అనేక జీవరాసులకు ఆవాసాలు. పర్యావరణ సమతుల్యానికి పట్టు కొమ్మలు. నదీనదాలకు వర్షాధారాలు. అడవులు మూలికా ఔషధాలకు నిలయాలు. జీవకోటికి ప్రాణ వాయువును అందించడం లోనూ, భూమి కోతను నివారించి భూసారాన్ని పరిరక్షించడం లోనూ ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అందుకే వృక్షో రక్షిత రక్షితః అన్నారు. వృక్షాలను మనం రక్షిస్తే, అవి మనల్ని రక్షిస్తాయి.

రిజర్వు అడవులు: ఇవి ప్రభుత్వం పరిరక్షణలో వుంటాయి. మానవుల, పశువుల సంచారానికి మరియు కలప కొరకు చెట్లును నరకడం ఈ అడవులలో నిషేధం. భారత దేశంలో ఈ అడవులు 40.1 మిలియన్ హెక్టార్లు అనగా 53% వరకు విస్తరించి వున్నాయి.రక్షిత అడవులు: ఇవి ప్రభుత్వం పరిరక్షణలో వున్నప్పటికీ మానవులు, పశువులు సంచారానికి అనుమతి వుంది. అయితే ఈ అడవులకు ఎటువంటి నష్టాన్ని కలుగ చేయకూడదు. భారత దేశంలో ఈ అడవులు 21.5 మిలియన్ హెక్టార్లు అనగా 29% వరకు విస్తరించి వున్నాయి. కేటాయించని అడవులు: ఇవి చెట్లు నరకడానికి, మరియు పశువుల సంచారానికి ఎటువంటి నియమ నిర్బంధాలు లేవు. భారత దేశంలో ఈ అడవులు 13.1 మిలియన్ హెక్టార్లు అనగా 18% మేరకు విస్తరించి వున్నాయి. అడవులు ప్రపంచంలో 4.057 మిలియన్ హెక్టార్ల భూభాగంలో విస్తరించి వున్నాయి. ప్రపంచ అటవీ విస్తీర్ణత లో భారత దేశంలో అటవీ విస్తీర్ణత 1.85% వుంది. అంటే 2% కూడా లేదు. తలసరి అటవీ విస్తీర్ణత 0.05 హెక్టార్లు మాత్రమే వుంది. 2003 ఇండియన్ సెట్ ఫారెస్టు రిపోర్టు ప్రకారం 69.79 మిలియన్ హెక్టార్ల అడవులు భారత దేశ భూభాగంలో విస్తరించి వున్నాయి. ఇది దేశ భౌగోళిక విస్తరణలో 21.23%గా వుంది. ఈ నివేదిక 2013 ప్రకారం అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 34.572 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అడవులు విస్తరించి ఉన్నాయి. రాష్ట్ర భూభాగంలో 22.64% కలిగి వున్నాయి. దేశ అటవీ విస్తీర్ణత ప్రకారం ఆంధ్ర రాష్ట్రం 9వ స్థానాన్ని కలిగి వుంది. ఇక తెలంగాణ రాష్ట్రంలో 29.242 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అడవులు విస్తరించి ఉండేవి. రాష్ట్ర భూభాగంలో 25.46% మేరకు విస్తరించి ఉండేవి. కానీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఖమ్మం జిల్లాలోని 327 ముంపు గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌లో కలపడం వల్ల రాష్ట్ర అడవుల విస్తీర్ణం 26,903.70 చ.కి.మీ.కు తగ్గింది. ఇది రాష్ట్ర వైశాల్యంలో 23.99 శాతం. దేశ అటవీ విస్తీర్ణతలో 4.22% వరకు విస్తరించి, తెలంగాణ 12వ స్థానాన్ని కలిగి వుంది. ఈ సర్వే ప్రకారం భారత దేశంలో అడవులు ఎక్కువగా వున్న రాష్ట్రలలో మధ్య ప్రదేశ్ మె?దటి స్థానాన్ని రెండవ స్థానాన్ని అరుణాచల ప్రదేశ్ మూడవ స్థానాన్ని ఛత్తీస్ గడ్ రాష్ట్రాలు వరుస స్థానాల్లో వున్నాయి. అత్యధిక అడవులు కలిగిన కేంద్ర పాలిత ప్రాంతాల్లో మె?దటి స్థానంలో నికోబార్ రెండవ స్థానంలో దాద్రా నగర్ హవేలి వున్నాయి. భారత దేశంలో అత్యధిక శాతం అడవులు కలిగిన రాష్ట్రాలు మిజోరం మె?దటి స్థానంలో అరుణాచల ప్రదేశ్ రెండవ స్థానంలో వున్నాయి. దేశంలో అత్య అల్ప శాతం అడవులు కలిగిన రాష్ట్రలు వరుసగా హర్యానా మొదటి స్థానంలో పంజాబ్ రెండో స్థానంలో బీహార్ మూడో స్థానంలో వున్నాయి. అత్యఅల్ప శాతం అడవులు కలిగిన కేంద్ర పాలిత ప్రాంతాలు వరుసగా పుదుచ్చేరి మె?దటి స్థానంలో ఢిల్లీ రెండవ స్థానంలో వున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏటా లక్షా డబ్బై వేల ఎకరాల అడవులు అంతరిస్తున్నట్లు శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. చెట్లును నరికివేసి వాటి నుంచి వచ్చే కలపను ఇంధనంగా వాడటం, పశువుల పచ్చిక బయళ్ళుగా మార్చడం, వంట చెరకు, గృహ నిర్మాణాలు, గృహోపకరణాలకు ఉపయో గించడం, పెరుగుతున్న ప్రపంచ జనాభా అవసరాలను తీర్చడానికి జనావాసాలుగా మార్చడం వంటి చర్యలను అటవీ నిర్మూలనకు కారణాలు. అలాగే అడవుల్లో సంభవిస్తున్న అగ్ని ప్రమాదాలతో విలువైన జాతుల అటవీ సంపదకు నష్టం వాటిల్లుతోంది. భారీ వృక్షాలు, అడవి జంతువులతో పాటు ఆయుర్వేద గుణాలున్న విలువైన మూలికా వృక్షాలు, మొక్కలకు చేటు కలుగుతోంది. సమస్త జీవకోటికి ప్రత్యక్షంగా, పరోక్షంగా అడవులే ఆధారం. అయితే, ప్రస్తుతం అంతరించి పోతున్న అడవులు జీవ వైవిధ్యానికి గొడ్డలి పెట్టుగా మారాయి. ఒకవైపు అక్రమార్కుల చేతిలో పడి అడవులు చిక్కిపోతుంటే, మరోవైపు మానవ తప్పిదాలు అటవీ సంపదకు చేటు చేస్తున్నాయి. వేసవిలో ఏటా అగ్ని ప్రమాదాలకు వృక్ష సంపద ఆహుతవుతోంది. పెరుగుతున్న జనాభా తమ అవ సరాలకు మించి అడవులను నరికివేస్తున్న వైనం. దీంతో ఉష్ణోగ్రతలు పెరిగి జల, వాయు కాలుష్యాలు అధికమై సమస్త జీవరాసుల మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదముంది. అటవీ నిర్మూలన జరిగిన ప్రదేశాల్లో భూమి కోతకు గురవుతుంది. బంజరు భూమిగా రూపాంతరం చెందుతుంది. వైల్డ్ లైఫ్ యాక్ట్ ప్రకారం భూభాగంలో 33 శాతం అడవులు ఉండాలి. ప్రస్తుతం 24.12 శాతం మాత్రమే ఉన్నాయి. ఇది చాలా విచారించదగ్గ విషయం. అంతరించి పోతున్న వాటిని కాపాడు కోవలసిన బాధ్యత అందరిపైనా ఉంది. అడవుల రక్షణ బాధ్యత అందరిది.

# తెలుగుతనానికి నిర్వచనం తుమ్మల సీతారామ మూర్తి



అచ్చ తెలుగు మాటలతో అందమైన పద్యాలు అల్లగలిగిన ఆధునిక కవుల్లో ఆయనను మించిన వారు లేరంటె అతిశయోక్తి కాదు. కవిగా, పండితుడిగా, తనకు తానే తీర్చిదిద్దుకొన్న ప్రతిభాశాలి ఆయన. భాషాపరంగా ఆయన సంప్రదాయ బద్ధుడైనా భావనా పరంగా ఆధునికులు. అచ్చమైన గాంధేయవాది.తెలుగుదనం మూర్తీభవించిన, తెలుగు భాషానురక్తి కలిగిన జాతీయోద్యమ కవి. ఆయనే అభినవ తిక్కన బిరుదాంకితుడు తుమ్మల సీతారామమూర్తి. సౌమ్యశీలి, నిరాడంబరుడు, గాంధేయవాది, తెలుగు రైతుబిడ్డ, ఆధునిక పద్య కవుల్లో అన్నింటా ముందుండి తెలుగు భాషానురక్తి కలిగిన మహా కవి. తుమ్మల సీతారామమూర్తి 1901 డిసెంబర్ 25 న గుంటూరు జిల్లా చెరుకుపల్లి మండలంలోని కావూరు గ్రామంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు చెంచమాంబ, నారయ్య. తాడేపల్లి వెంకటప్ప య్య శాస్త్రి, దువ్వూరి వెంకటరమణ శాస్త్రి వంటి ప్రముఖుల వద్ద విద్యనభ్యసించారు. "మహాత్ముని ఆస్థానకవి" అని కట్టమంచి రామలింగారెడ్డితో పలికించుకున్న తుమ్మల, ఆత్మకథ, మహాత్మ కథ వంటి ఆదర్శ ప్రౌఢ కావ్యాలు, ఆత్మార్పణము, రాష్ట్రగానము, ఉదయ గానము, పఠిగ పంట, పైర పంట, శబల, సమదర్శి, నా కథలు వంటి సామాజిక కవిత్వాన్ని అందించారు.1930లో ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయము నుండి ప్రథమ శ్రేణిలో ఉభయ భాషా ప్రవీణ పట్టాను అందుకున్నారు. చదువు పూర్తయ్యాక, తన స్వగ్రామం కావూరు లోని తిలక్ జాతీయ పాఠశాలలో 1924 నుండి 1929 వరకు ఉపాధ్యాయుడిగా పని చేసారు. 1930 నుండి 1957 వరకు గుంటూరు జిల్లా బోర్డులోని దుగ్గిరాల, బాపట్ల, నిడుబ్రోలు, అప్పికట్ల ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేసారు.1920-1930 మధ్య కాలంలో కాంగ్రెసులో చేరి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. 1922లో జైలుశిక్ష అనుభవించారు. 1928లో తుమ్మల 'ఆత్మార్పణము' అనే కావ్యాన్ని రచించారు. 1938 లో 'సోదరా లెమ్ము, నీ హక్కులందు కొమ్ము' అని ఆంధ్రరాష్ట్ర సిద్ధి కోసం తన 'రాష్ట్ర గానం' ద్వారా తెలుగువారిని వెన్ను తట్టి లేపారు. తెలుగువారి పూర్వవైభవాన్ని ఎలుగెత్తి చాటి ప్రత్యేక రాష్ట్రసాధనకు ప్రబోధించారు. 1840లో ధర్మజ్యోతి అనే ఒక గాథను,1943లో 'పఠిగి పంట', 1950లో గాంధీజీ ఆత్మకథకు పద్య అనువాదమైన 'ఆత్మకథ'ను రచించారు. 1953లో 'ఉదయగానం' గావించారు. 1955లో 'శబిల' అనే ఖండ కావ్యాల సంపుటిని వెలువ రించారు. తెలుగు సాహిత్య సరస్వతికి శిరోభూషణమైన 'సంక్రాంతి తలపులు' ఈ సంపుటి లోనివే. 1957లో 'గీతాధర్మము' పేరుతో భగవద్గీతకు అనువాదం చేశారు. భర్తృహరి నీతి శతకాన్ని 'తెలుగు నీతి' పేరుతో తెనిగించారు. 'సర్వోదయ' సిద్ధాంతాన్ని విశదీకరిస్తూ 1960లో 'సర్వోదయ గానం' చేశారు. 1963లో తన అభిరుచులు, ఆదర్శాలు, అనుభవాలు వెల్లడి చేస్తూ 'నేను' అనే కావ్యాన్ని,1964లో 'పైరపంట', 1967లో ఆదర్శ ప్రాయులైన కొందరు త్యాగ ధనుల గుణగణాలను విశదీకరిస్తూ 'సమదర్శి' రచించారు. తుమ్మల కవిత్వంలో గ్రామీణ జీవిత, ఆంధ్రత్వ, భారతీయత్వ, విశ్వమానవత్వ లక్షణాలుంటాయి. ఆయనది ప్రధానంగా ధర్మ ప్రబోధనాత్మక కవిత్వం. తాను తెలుగు వాడననే అభిమానం ఆయనలో ఎక్కువ. తెలుగు జాతి, తెలుగు భాష, తెలుగు చరిత్ర, తెలుగు సంస్కృతి అంటే పులకించి పోయేవారాయన. కాల్పనిక వాదం, మానవీయత, దేశభక్తి అనే మూడు ప్రధాన అంశాలతో సీతారామ మూర్తి గారు తన రచనలను కొనసాగించారు. అనేక నాటకాలు, హరికథలు కూడా రచించారు.తెలుగు భాషా సాహిత్యాలకు ఆయన చేసిన సేవలను కీర్తిస్తూ, ఘన సన్మానం చేసి 'అభినవ తిక్కన' అనే బిరుదును ఇస్తే, వినయ పూర్వకంగా, తాను తిక్కన అంత ఘనుణ్ణి కాదని, 'తెలుగు భాషకు సేవకుడను' అనే అర్థం వచ్చేలా 'తెనుగు లెంక' అని పేరు పెట్టుకున్న మహాకవి తుమ్మల సీతారామమూర్తి చౌదరి. రైతు జీవితానికి కావ్య గౌరవం కల్పించి, తెలుగు నుడికారానికి ప్రాణంపోసి, తెనుగు దనానికి నిర్వచనంగా నిలిచిన తుమ్మలను కొంగర జగ్గయ్య 'కళా తపస్వి'గా సంభావించారు. ఒకనాడు వెండి తెర నాయకుడైన చిత్తూరు నాగయ్యకు తుమ్మల అభిమాన కవి. 1949 నిడుబ్రోలులో - గజారోహణము, గండ పెండేరము, కనకాభిషేకము, సువర్ణ కంకణము; 1960లో అఖిల భారత తెలుగు రచయితల మహాసభ సత్కారము; 1967లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యత్వ ప్రదానము; 1969లో కేంద్ర సాహిత్య అకాడమీ బహు మానము; 1969లో ఆంధ్ర విశ్వ విద్యాలయము "కళాప్రపూర్ణ" బిరుదుతో సత్కారము; 1984 మద్రాసులో శ్రీ ఎల్. వి. రామయ్య చారిటీస్ జాతీయకవి అవార్డు; 1985 లో నాగార్జున విశ్వ విద్యాలయం నాగార్జున విశ్వ విద్యాలయము "డాక్టర్ ఆఫ్ లెటర్స్" (డి.లిట్) బిరుదుతో సత్కారము పొందారు.నాటి యువ కవులను ఉద్దేశించి...వచనము గేయము ఆధారముగా చేసుకొని యువ కవులు వ్యవహారిక భాషలో కవిత్వము వ్రాయుచున్నారు. వీరిలో శ్రీశ్రీ వంటి సిద్ధహస్తులు కొందరున్నారు. భాషా మార్గము ఏదైనను రచయిత లోతుగా సాహిత్య కృషి చేసినపుడే పది కాలాల పాటు అది చరిత్రలో నిలుచును. మా తరం వారు చదివినంత గట్టిగా నేటి యువతరం కావ్య పఠనం చేయడం లేదు. పత్రికల నిండా ఏదో రాస్తున్నారు' అని తుమ్మల వ్యక్త పరిచిన అభిప్రాయం నేటికీ అక్షరాలా వాస్తవమని అనిపించక మానదు. 1990 మార్చి 21న గుంటూరు జిల్లా బాపట్ల మండలంలోని అప్పికట్ల గ్రామాలో తుమ్మల సీతారామమూర్తి మరణించారు. ఇరవై నాలుగు వేల పద్యాలు వ్రాసినా, ఆయన సాహిత్యం నిరాదరణకు గురవడం శోచనీయం. విద్యార్థులకు పాఠ్యాంశంగా ఆయన రచనలు ఉండక పోవడం తెలుగు సాహిత్యాభిమానులకు బాధాకరం.

## భావోద్వేగాల అంతరాత్మ కవిత్వం

ప్రపంచ కవితా దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 21న ప్రపంచ వ్యాప్తంగా జరుపు కుంటారు. 1999లో యునెస్కో ఈ రోజును అధికారికంగా ప్రకటించింది. ఈ దినోత్సవం లక్ష్యం కవిత్వాన్ని ప్రోత్సహించడం, కవులను గౌరవించడం, భాషా వైవిధ్యాన్ని స్మరించుకోవడం, సాంస్కృతిక సృజనాత్మకతను పురిగొల్పడం. కవిత్వం అనేది మానవ భావజాలానికి అద్భుతమైన ప్రతినిధి. ఇది ప్రేమను, బాధను, ఆశను, విరహాన్ని, సమాజాన్ని, ప్రకృతిని, సత్యాన్ని స్పష్టంగా ప్రతిబింబించగల శక్తివంతమైన సాధనం. కవిత్వం మనసులను ప్రభావితం చేయగలదు. ఒక చిన్న పద్యం ఎంతో గొప్ప మార్పుకు నాంది కావచ్చు. అత్యంత ప్రాచీన సాహిత్య రూపమైన కవిత్వాన్ని మన దేశంలో శతాబ్దాల నుండి గౌరవించడం కొనసాగుతోంది. భారతదేశం లోని అనేక రాజులు కవిత్వాన్ని ప్రోత్సహించి, కవులను ఆదరించారు. కానీ పాశ్చాత్య దేశాలలో కవిత్వానికి గౌరవం 18వ శతాబ్దం నాటికే ప్రారంభమైంది. తొలిసారిగా ఐరోపాలో 'విర్రీన' అనే రోమన్ కవికి అంకితంగా అక్టోబరులో కవితా దినోత్సవాన్ని జరిపారు. కవిత్వం యొక్క సామాజిక, సాంస్కృతిక ప్రాముఖ్యతను గుర్తించడం, కవిత్వ పఠనం, రచన, ప్రచురణ, బోధనను ప్రోత్సహించడం, స్థానిక, ప్రాచీన భాషలలో కవిత్వాన్ని ప్రోత్సహించడం, భిన్న సంస్కృతుల మధ్య అవగాహనను పెంచడం, యువ కవులకు ప్రోత్సాహం ఇవ్వడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశాలు.

# మండే వేసవిలో పవర్‌ఫుల్ పండు



ఎండలు దంచికొడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యంగా ఉండేందుకు.. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవడం ఉత్తమం.. ముఖ్యంగా సరిపడినంత నీరు తాగడం అలాగే.. మంచి ఆరోగ్యకరమైన పండ్లు తీసుకోవడం ఉత్తమం.. అలాంటి అద్భుతమైన పండ్లలో కర్బూజ ఒకటి.. ఇది తినడం వల్ల ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చు..వేసవికాలం వచ్చేసింది.. ఎండలు దంచికొడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యంగా ఉండేందుకు.. డీహైడ్రేషన్ బారిన పడకుండా.. హైడ్రేషన్ గా ఉండేందుకు .. మంచి పండ్లను తీసుకోవడం మంచిది.. అలాంటి అద్భుతమైన పండ్లలో కర్బూజ ఒకటి.. ఇది వేసవిలో శరీరానికి అద్భుతమైన చలువ చేస్తుంది.. ఈ పండులో అధిక నీటి శాతం ఉంటుంది.. దీనిలో 90శాతానికి పైగా నీరు.. డీహైడ్రేషన్‌ను నివారించేలా సహాయపడుతుంది.

**శరీరంలోని వేడి తగ్గుతుంది:**

కర్బూజ అద్భుతమైన పండు.. ఇది వేసవిలో శరీర ఉష్ణోగ్రతను తగ్గించి, శరీరాన్ని చల్లబరుస్తుంది, ఎండదెబ్బ నుంచి రక్షణ కల్పిస్తుంది. గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది: కర్బూజను తీసుకుంటే.. రక్తపోటు అదుపులో ఉండటంతోపాటు.. గుండె సంబంధిత వ్యాధుల నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది.. దీనిలో ఫోలిక్ యాసిడ్ పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తాన్ని శుద్ధి చేయడంలో.. అలాగే రక్త నాళాలలో రక్తం గడ్డకట్టడాన్ని నివారించడంలో సహాయపడుతుంది. కడుపు సమస్యలకు చెక్: వేసవి కాలంలో తరచూ గ్యాస్, అజీర్తి, మలబద్ధకం, కడుపులో నొప్పి, జీర్ణ సమస్యలతో ప్రజలు బాధపడుతుంటారు.. అయితే, ఈ సీజన్‌లో సులభంగా జీర్ణమయ్యే కర్బూజను తినడం ద్వారా.. కడుపు సమస్యలకు చెక్ పెట్టవచ్చు.. కంటి ఆరోగ్యం: కర్బూజ తినడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది.. అలాగే.. కంటికి సంబంధించిన సమస్యలు కూడా దూరమవుతాయి.. దీనిలోని విటమిన్ ఎ బీటా కెరోటిన్ కంటి చూపును మెరుగుపర్చి ఆరోగ్యంగా ఉంచుతాయి.లైంగిక సమస్యలు: కర్బూజలో విటమిన్ కె, ఇ కూడా పుష్కలంగా ఉంటాయి. అందువల్ల ప్రత్యుత్పత్తి వ్యవస్థ బాగా పనిచేస్తుంది. దీనిని రెగ్యులర్ గా తినడం వల్ల లైంగిక ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. మూత్రపిండాల్లో రాళ్లు: కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతున్న వారు కర్బూజను తీసుకుంటే.. ఈ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు.. అలాగే.. కర్బూజ బరువును తగ్గడంలో.. చర్మ ఆరోగ్యానికి బాగా సహాయపడుతుందని డైటీషియన్లు చెబుతున్నారు. అయితే.. ప్రతి రోజూ కర్బూజను తినడం వల్ల ఇలా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని పేర్కొంటున్నారు.

# కొబ్బరి నీళ్లు తాగితే ప్రమాదమా?



ప్రకృతి ప్రసాదించిన అత్యంత స్వచ్ఛమైన డ్రింక్ ఏది అంటే ఎవరైనా కొబ్బరి నీళ్లు అని చెబుతారు. విటమిన్లు, ఎలక్ట్రోలైట్లు, మినరల్స్‌కు నిలయమైన ఈ పానీయం దాహాన్ని తీర్చడమే కాదు, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని మనం నమ్ముతాం. అయితే అదే కొబ్బరి నీరు ఒక నిండు ప్రాణాన్ని కేవలం 26 గంటల్లో బలితీసుకుంటుందని ఎవరైనా ఊహిస్తారా? కొన్ని నెలల క్రితం డెన్మార్క్‌లో 69 ఏళ్ల వృద్ధుడికి ఎదురైన విషాదకర ఘటన ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. డెన్మార్క్‌లో ఒక వృద్ధుడు తాజాగా కనిపిస్తున్న కొబ్బరికాయను కొట్టించుకుని నీళ్లు తాగాడు. తాగిన మూడు గంటలకే అతనికి విపరీతంగా చెమటలు పట్టడం, వాంతులు, వికారం మొదలయ్యాయి. ఆసుపత్రికి తరలించేసరికి అతను గందరగోళానికి గురై, కండరాల కదలికలపై నియంత్రణ కోల్పోయాడు. వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కేవలం 26 గంటల్లోనే అతని శరీరంలోని కీలక అవయవాలన్నీ విఫలమై మరణించాడు. మృత్యుపాశం: పరిశోధనలో తేలిన అంశం ఏంటంటే.. వైద్యులు నిర్వహించిన కొబ్బరి నీరు సేవించిన తర్వాత ప్రాణాంతకమైన 3-నైట్రోప్రొపియోనిక్ విషం వల్ల చనిపోయినట్లు అధ్యయనంలో షాకింగ్ నిజాలు బయటపడ్డాయి. ఆ కొబ్బరి నీళ్లలో 3-నైట్రోప్రొపియోనిక్ యాసిడ్ అనే శక్తివంతమైన శిలీంధ్ర విషం ఉన్నట్లు గుర్తించారు. బయటకు కాయ తాజాగా కనిపిస్తున్నా లోపల ఈ విషపూరిత శిలీంధ్రాలు వృద్ధి చెందుతాయి. ఇది ఎలా చేరుతుంది: కొబ్బరికాయలు కోసిన తర్వాత వాటిని సరైన పద్ధతిలో నిల్వ చేయకపోతే, ముఖ్యంగా వెచ్చని, తేమతో కూడిన వాతావరణంలో ఉంచినప్పుడు, పెంకుపై ఉండే సూక్ష్మ పగుళ్ల ద్వారా ఆర్థ్రోబీనియం వంటి శిలీంధ్రాలు లోపలికి ప్రవేశిస్తాయి. ఇవి నీటిలో చేరి 3-ఔఖం అనే విషాన్ని ఉత్పత్తి చేస్తాయి. బయటకు కాయ ఎంతో తాజాగా కనిపిస్తున్నా, లోపల మాత్రం ఈ నిగూఢ విషం తయారవుతుంది. కలుషిత కొబ్బరి నీళ్లు తాగిన కొద్ది గంటల్లోనే వాంతులు, విరేచనాలు, తీవ్రమైన కడుపునొప్పి రావచ్చు. 3-ఔఖం నేరుగా మెదడును, నాడీ వ్యవస్థను దెబ్బతీస్తుంది. దీనివల్ల మూర్ఛలు, కండరాల అసాధారణ సంకోచాలు సంభవిస్తాయి. ఊపిరితిత్తుల్లో ద్రవం చేరడం, ఛాతి బిగుతుగా మారి శ్వాస తీసుకోవడం కష్టమవ్వడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. విషం తీవ్రత పెరిగితే కాలేయం, కిడ్నీలు దెబ్బతిని మరణం సంభవించవచ్చు. నీరు తాగేటప్పుడు కొంచెం పుల్లగా ఉన్నా, రుచి మారినా లేదా అసాధారణ వాసన వస్తున్నా వెంటనే ఆ నీటిని పారేయండి. ప్యాక్ చేసిన కొబ్బరి నీళ్లను పాశ్చరైజేషన్ చేస్తారు కాబట్టి, అవి నేరుగా చిప్ప నుండి తాగే వాటికంటే కొన్నిసార్లు సురక్షితం. కొబ్బరికాయలను చల్లని ప్రదేశంలో ఉంచండి. అయితే ఫ్రిజ్‌లో ఉంచినంత మాత్రాన ప్రమాదం పూర్తిగా పోదు, తాగే ముందు తనిఖీ ముఖ్యం. గర్భిణీలు, చిన్న పిల్లలు మరియు వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు పచ్చి, శుద్ధి చేయని కొబ్బరి నీటిని తాగేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలి.

# బీట్‌రూట్..ఈ సమస్యలు ఉన్నవారు తాగితే రిస్క్



బీట్‌రూట్.. పోషకాల గని. ఇందులో ఉండే ఫోలేట్, పొటాషియం, విటమిన్-సి వంటి పోషకాలు శరీరాన్ని అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయి. రక్తాన్ని పెంచడానికి, చర్మాన్ని మెరుగుపరచడానికి చాలా మంది బీట్‌రూట్ జ్యూస్‌ను క్రమం తప్పకుండా తీసుకుంటారు. అయితే ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఈ పోషకమైన జ్యూస్ అందరికీ సరిపడదు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఇది ప్రయోజనానికి బదులుగా హాని కలిగించే అవకాశం ఉంది. కిడ్నీలో రాళ్ల సమస్య : ఎవరికైతే కిడ్నీలో రాళ్లు ఉన్నాయో లేదా గతంలో ఆ సమస్యతో బాధపడ్డారో, వారు బీట్‌రూట్ జ్యూస్ తాగకపోవడమే మంచిది. బీట్‌రూట్‌లో ఆక్సలేట్ అనే మూలకం అధికంగా ఉంటుంది. ఇది కిడ్నీలో రాళ్ల సమస్యను మరింత తీవ్రతరం చేయడమే కాకుండా, కొత్తగా రాళ్లు ఏర్పడటానికి కారణమవుతుంది. తక్కువ రక్తపోటు: బీట్‌రూట్ సహజంగానే రక్తపోటును తగ్గించే గుణాన్ని కలిగి ఉంటుంది. ఇది హై బీపీ ఉన్న రోగులకు వరప్రసాదం లాంటిది. కానీ, ఇప్పటికే లో బీపీతో బాధపడేవారు దీనిని తీసుకుంటే రక్తపోటు మరింత పడిపోయి, నీరసం లేదా కళ్లు తిరగడం వంటి సమస్యలు తలెత్తవచ్చు. బలహీనమైన జీర్ణశక్తి: తరచుగా కడుపు నొప్పి, గ్యాస్ లేదా ఉబ్బరం వంటి జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడేవారు బీట్‌రూట్ రసానికి దూరంగా ఉండాలి. బీట్‌రూట్ తీసుకోవడం వల్ల కొంతమందిలో జీర్ణక్రియ మందగించి, కడుపులో అసౌకర్యం కలిగే అవకాశం ఉంది.

**అలర్జీ సమస్యలు:** అలర్జీలు ఉన్నవారికి బీట్‌రూట్ రసం ఒక్కోసారి వికటించవచ్చు. దీనివల్ల చర్మంపై దురద, ఎర్రటి దద్దుర్లు లేదా చికాకు కలగవచ్చు. కొంతమందిలో వికారం లేదా వాంతులు వంటి దుష్ప్రభావాలు కూడా కనిపించవచ్చు. ఏదైనా అతిగా తీసుకుంటే అది హాని కలిగిస్తుందనేది మరువకూడదు. బీట్‌రూట్ జ్యూస్ మీ శరీరానికి సరిపడుతుందో లేదో తెలుసుకోవడానికి తక్కువ పరిమాణంలో ప్రారంభించడం లేదా మీ వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం.



# మల్టీగ్రెయిన్ పిండి అందరికీ మంచిది కాదా?

ఆధునిక జీవనశైలిలో ఆరోగ్య స్పృహ పెరగడంతో చాలా మంది సాధారణ గోధుమ పిండికి బదులుగా మల్టీగ్రెయిన్ పిండిని వాడుతున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని భావించే మల్టీగ్రెయిన్ పిండి అందరికీ సరిపడకపోవచ్చు. ప్రకటనల్లో చూసినట్లుగా ఇది అందరికీ అమృతం లాంటిది కాదు. కొన్ని ప్రత్యేక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు దీనిని తీసుకునే ముందు జాగ్రత్త వహించాలని నిపుణులు సూచిస్తున్నారు. లేదంటే, కొన్ని సందర్భాల్లో ఇది ఆరోగ్యానికి మేలు కంటే కీడే ఎక్కువ చేయవచ్చు అంటున్నారు. ఆధునిక జీవనశైలిలో ఆరోగ్య స్పృహ పెరగడంతో చాలా మంది సాధారణ గోధుమ పిండికి బదులుగా మల్టీగ్రెయిన్ పిండిని వాడుతున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని భావించే మల్టీగ్రెయిన్ పిండి (ఓబీశ్రీబితిణతీజీతిని ఒబిబిజీ) అందరికీ సరిపడకపోవచ్చు. ప్రకటనల్లో చూసినట్లుగా ఇది అందరికీ అమృతం లాంటిది కాదు. కొన్ని ప్రత్యేక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు దీనిని తీసుకునే ముందు జాగ్రత్త వహించాలని నిపుణులు సూచిస్తున్నారు. లేదంటే, కొన్ని సందర్భాల్లో ఇది ఆరోగ్యానికి మేలు కంటే కీడే ఎక్కువ చేయవచ్చు అంటున్నారు. మల్టీగ్రెయిన్ పిండిలో గోధుమలతో పాటు జొన్నలు, సజ్జలు, రాగులు, సోయాబీన్ మరియు శనగలు వంటి వివిధ రకాల ధాన్యాలు కలుస్తాయి. ఇది పీచు పదార్థం (ఈతిఎవతీ) మరియు ప్రోటీన్లకు మంచి వనరు అయినప్పటికీ, అందరి శరీరతత్వానికి ఇది సెట్ అవ్వదు. మీ శరీర అవసరాలకు అనుగుణంగా ధాన్యాలను ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. జీర్ణక్రియ సమస్యలు ఉన్నవారు: మల్టీగ్రెయిన్ పిండిలో ఫైబర్ చాలా ఎక్కువగా ఉంటుంది. జీర్ణశక్తి తక్కువగా ఉన్నవారు లేదా ఐబీఎస్ (ఎఖా) వంటి సమస్యలు ఉన్నవారు దీనిని తింటే ఆహారం త్వరగా అరగదు. దీనివల్ల కడుపు నొప్పి, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు తలెత్తుతాయి.

కిడ్నీ రోగులు: కిడ్నీ సమస్యలతో బాధపడేవారు తక్కువ పొటాషియం, ఫాస్పరస్ ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. మల్టీగ్రెయిన్ పిండిలో వివిధ రకాల చిరుధాన్యాలు కలవడం వల్ల వీటి శాతం పెరుగుతుంది, ఇది కిడ్నీలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది.థైరాయిడ్ సమస్యలు: చాలా మల్టీగ్రెయిన్ మిశ్రమాలలో సోయాబీన్ పిండిని కలుపుతారు. సోయాలో ఉండే కొన్ని పదార్థాలు థైరాయిడ్ మందుల పనితీరును అడ్డుకుంటాయి. కాబట్టి థైరాయిడ్ ఉన్నవారు సోయా లేని పిండిని ఎంచుకోవాలి. అలర్జీ బాధితులు: మార్కెట్లో దొరికే పిండిలో ఏయే ధాన్యాలు ఏ నిష్పత్తిలో ఉన్నాయో స్పష్టంగా తెలియదు. గ్లూటెన్ పడని వారు లేదా కొన్ని రకాల ధాన్యాల పట్ల అలర్జీ ఉన్నవారు దీనిని వాడటం వల్ల చర్మ సమస్యలు లేదా శ్వాస ఇబ్బందులు రావచ్చు. నిపుణుల సలహా: బయట దొరికే రెడీమేడ్ ప్యాకెట్ల కంటే, ఇంటి వద్దే మీకు కావలసిన ధాన్యాలను తగిన నిష్పత్తిలో కలిపి పిండి పట్టించుకోవడం ఉత్తమం. ప్రారంభంలో తక్కువ పరిమాణంలో తిని, మీ శరీరానికి అది పడుతుందో లేదో గమనించాలి.

# ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లలో వెయ్యి కోట్ల స్కాం

ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లలో స్కాంలు కొనసాగుతున్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. రిటైర్డ్ ఉద్యోగులను పెట్టుకుని సీఎం రేవంత్ రెడ్డి స్కాంలు చేస్తున్నాడని అన్నారు. అందులో సీఈ, ఈఎన్‌సీ అందరూ రిటైర్డ్ వాళ్లే ఉన్నారని తెలిపారు. నాలుగైదు స్కూళ్లను ప్యాకేజీ చేసి అన్యాయాలకు తెర తీశారని హరీశ్‌రావు మండిపడ్డారు. వీటి టెండర్లలో రూ.1000 కోట్ల స్కాం జరిగిందని అన్నారు. ఇందులో బీజేపీ వారికి ఒకటి, రెండు ప్యాకేజీలు దక్కాయని తెలిపారు. సమయం వచ్చినప్పుడు ఆ వివరాలన్నీ బయటపెడతామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 76 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు టెండర్లు పూర్తి చేయగా, అందులో ఒక్కటంటే ఒక్కటి కూడా బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలున్న 26 నియోజకవర్గాలకు ఇవ్వలేదని హరీశ్‌రావు తెలిపారు. కక్షపూరితంగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు స్కూళ్లు మంజూరు చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు, అలాగే కొందరు బీజేపీ ఎమ్మెల్యేలకు మాత్రం స్కూళ్లు కేటాయించారని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో భారీ అవినీతి జరుగుతోందని హరీశ్‌రావు అన్నారు. కాంట్రాక్టర్లు ఆర్గనైజ్డ్ రింగ్ గా అయ్యి పనులను పంచుకుంటున్నారని అన్నారు. 76 స్కూళ్లకు సంబంధించిన ప్రతి టెండర్ కి ఎక్సెస్ ధర కోట్ చేసి దక్కించుకున్నారని తెలిపారు. టెండర్లలో కనిష్టంగా 4.59% నుంచి గరిష్టంగా 4.96% ఎక్సెస్‌తో, నిబంధనల ప్రకారం 5% దాటకుండా పక్కా ప్లాన్‌తో కొల్లగొట్టారని విమర్శించారు. ఒక్కో స్కూలుకు రూ. 250 కోట్లు కేటాయించగా, అందులో సివిల్ వర్క్స్ కోసమే సుమారు రూ. 150 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారని చెప్పారు. 76 స్కూళ్లకు సంబంధించి ప్రభుత్వ అంచనా వ్యయం రూ. 10,199.54 కోట్లు కాగా, కాంట్రాక్టర్లు దాన్ని రూ. 10,693.55 కోట్ల ఎక్సెస్‌తో దక్కించుకున్నారని అన్నారు. అంటే కేవలం ఈ టెండర్ల ద్వారా సుమారు రూ. 494 కోట్లు ప్రజాధనాన్ని అదనంగా దోచిపెడుతున్నారని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ తో పాటు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గం మధిరల్లో అత్యధికంగా 4.95% ఎక్సెస్ ధరకు టెండర్లు కేటాయించడం పలు అనుమానాలకు కలిగిస్తున్నాయని హరీశ్‌రావు అన్నారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క నియోజకవర్గంలో 4.95 ఎక్సెస్.. మంత్రి ఉత్తమ్




కుమార్ రెడ్డి నియోజకవర్గం హుజూర్ నగర్ లో 4.95 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గం హుస్నాబాద్ లో 4.95 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారని.. మంత్రి జూపల్లి కృష్ణారావు నియోజకవర్గం కొల్లాపూర్ లో 4.77 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారని చెప్పారు. మంత్రి కొండా సురేఖ నియోజకవర్గం వరంగల్ ఈస్ట్ లో 4.99 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారన్నారు. మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి నియోజకవర్గం నల్గొండలో 4.87 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నియోజకవర్గం ఖమ్మంలో 4.95 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారని తెలిపారు. మంత్రి సీతక్క నియోజవర్గం ములుగులో 4.95 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారని పేర్కొన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ నియోజకవర్గం ఆంథోల్ లో 4.99 కు ఎక్సెస్ టెండర్ ఇచ్చారని.. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నియోజకవర్గం వికారాబాద్ లో 4.89 కు ఎక్సెస్ టెండర్ ఇచ్చారని.. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నియోజకవర్గం మంథనిలో 4.89 కు ఎక్సెస్ టెండర్ ఇచ్చారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి వాడుతున్న వాహనం ఐబూఖీ కంపెనీ పేరు మీదనే ఉంటుందని హరీశ్‌రావు తెలిపారు. ఆశ్చర్యకరంగా ముఖ్యమంత్రి నియోజకవర్గంతో పాటు ఏకంగా 9 స్కూళ్ల టెండర్లను ఈ ప్రభుత్వం అదే ఐబూఖీ సంస్థకు కట్టబెట్టిందని పేర్కొన్నారు. మంత్రుల నియోజకవర్గాల్లోనే ఎక్కువ ధరకు టెండర్లు ఖరారు కావడం ఈ కుంభకోణానికి నిదర్శనమని చెప్పారు. నాడు కేసీఆర్ పదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఏనాడూ రాజకీయ పక్షపాతం చూపలేదని గుర్తుచేశారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు సమానంగా ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. మిషన్ కాకతీయ మొదటి దశ నుంచే, మిషన్ భగీరథ, బీసీ,మైనార్టీ గురుకులాలు ఇలా ఏ పథకమైనా 119 నియోజకవర్గాలకు సమానంగా ఇచ్చారని అన్నారు మెడికల్ కాలేజీలను అన్ని జిల్లాలకు ఇస్తూ, నేటి కాంగ్రెస్ మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గానికి కూడా ఇచ్చామని తెలిపారు. దళిత బంధు లాంటి గొప్ప పథకాన్ని ప్రతిపక్ష నేతగా ఉన్న భట్టి విక్రమార్క నియోజకవర్గమైన మధిర చింతకాని నుంచే పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ఘనత కేసీఆది అని హరీశ్‌రావు కొనియాడా రు. అభివృద్ధిని సమానంగా చూసిన బీఆర్ఎస్ ఎక్కడ? కేవలం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారన్న అక్కసుతో 26 నియో జకవర్గాలకు స్కూళ్లను ఆపేసిన మీరెక్కడ? అని ప్రశ్నించారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణంలో జరిగిన ఈ వందల కోట్ల టెండర్ల కుంభకోణంపై శాసనసభలో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని అన్నారు. నా దగ్గర ఈ స్కామ్ కు సంబంధించి ఇంకా పూర్తి ఆధారాలు, వివరాలు ఉన్నాయని.. వాటన్నింటినీ అసెంబ్లీ సమావేశాల్లో సభ సాక్షిగా బయటపెడతానని స్పష్టం చేశారు.

# ప్రతి సోమవారం మండల స్థాయి అధికారి గ్రీవెన్స్‌కు హాజరు కావాల్సిందే

**నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు .**

**జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్**

**పిజిఆర్ఎస్‌కు 43 అర్జీలురెవెన్యూ క్లినిక్‌కు 9 అర్జీలు**

**పాడేరు :** సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 43, రెవెన్యూ క్లినిక్ కు 9 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్నా జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్ , ఇంచార్జి డిఆర్ఓ అంబేద్కర్, ఇంచార్జి ఆర్డిఓ లోకేశ్వరరావు లతో కలసి సంయుక్తంగా వివిధ మండలాల, గ్రామాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. అర్జీ దారుల నుండి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరితగతన పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సంబంధిత భూ సమస్యలను తక్షణమే పరిష్కరించుటకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నందు ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ ని నిర్వహించడం జరుగుతుందని మండల రెవెన్యూ అధికారులు, డిప్యూటీ తాసిల్దారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు,సర్వేయర్లు,విలేజి రెవెన్యూ ఆఫీసర్లు సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉంటారని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ఫిర్యాదులను స్వీకరించడం, పరిష్కరించడం జరుగుతుందని కొన్ని రకాల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడం, పరిష్కరం కానీ ఫిర్యాదులను ఎంత గడువు గడువులోగా పరిష్కరిస్తారో తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల స్థాయిలో ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక నిర్వహించాలని ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని అలా లేని ఎడల వారిపై తగు చర్యలు ఉంటాయని తెలిపారు. మండల స్థాయిలో వచ్చే అర్జీలను మండల్ స్థాయి లోనే పరిశీలించినట్లయితే, జిల్లాస్థాయిలో ప్రజా ఫిర్యాదులు తగ్గుతాయని తద్వారా వాటిని వెంటనే పరిష్కరించగలరని తెలిపారు. ముఖ్యమంత్రి, ఉప



ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధుల నుండి వచ్చే గ్రీవెన్స్ ను కూడా నిర్ణీత గడువులోపు అర్జీదారంతో మాట్లాడే సమస్యను పరిష్కారించి, గ్రీవెన్స్ హోటల్ లో అప్లోడ్ చేసి ఫిర్యాదును క్లోజ్ చేయాలన్నారు. అప్పుడు మాత్రమే పోర్టర్లో పెండింగ్ లేకుండా ఉంటుందని లేకుంటే పదేపదే అప్లికేషన్ రిపీట్ అవుతుందని తెలియజేశారు. గ్రీవెన్స్ లో అర్జితాలు ఇచ్చే అర్జీలు పూర్తిగా పరిశీలించి సంబంధిత శాఖకు పంపే విధంగా చూడాలన్నారు. అర్జిదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని,అర్జీలు నేటికీ పరిష్కారం కాకపోయినా, ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి ఓవవనీబజీఎ.జీజూ.ఐనీల.తిని (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ ను సంప్రదిం చవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యలపై ప్రభుత్వం ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తుందని ఐవి ఆర్ ఎస్ ద్వారా ప్రజల నుండి అభిప్రాయాలను తీసుకుంటుందని, ప్రజల యొక్క ఫిర్యాదులు పరిష్కరించి వారి యొక్క సంతృప్తి స్థాయిలు పెంచాలని, ఈ ప్రక్రియలో జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించి ఏ స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు కార్యాల యాల నుంచి ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయో ఆ స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయాల పరిధిలో ఉన్నటువంటి ఫిర్యాదుదారులు లతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సమస్య ఎందుకు పరిష్కారం కాదో బాధ్యతగా ఫిర్యాదు దారుణకు వివరించాలన్నారు. ప్రత్యేకంగా భూ సంబంధిత సమస్యలపై వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించేటప్పుడు కచ్చితంగా ఫిర్యాదు దారుని భూ రికార్డులను తనిఖీ చేయాలని, ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారంతో క్రోడీకరించి సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడాలన్నారు. మండల స్థాయి అధికారులు సమస్యలను పరిష్కరించుటలో కింది స్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. పిర్యాధుదా రునితో మర్యాద పూర్వకముగా వ్యవహరించాలని, ఫిర్యాదును ముగించుటలో ఎటువంటి అత్యుత్సాహం ప్రదర్శించరాదని, విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# కాటికి పంపేదాకా ఆగని కసాయి బంధం

**ప్రాణముండగానే శ్మశానానికి శ్రీధర్**

**రక్తం పంచుకున్నోళ్లే రాక్షసులైతే.. ఇక దిక్కెవరు??**

**భారమనుకున్నారో, బాధ్యత విస్మరించారో గానీ..**

**నిస్సహాయుడిని నిర్దాక్షిణ్యంగా వదిలేసిన వైనం!**

**జగిత్యాల :** కన్నవారు, ఉన్నవారు అండగా నిలవాల్సిన క్లిష్ట సమయంలో కసాయిగా మారిన వైనం జగిత్యాల పట్టణంలో తీవ్ర కలకలం రేపింది. రక్తసంబంధం అని కూడా చూడకుండా, ప్రాణాలతో ఉన్న వ్యక్తిని మృత్యువు ఒడిలోకి నెట్టేలా స్మశానవాటికలో వదిలివెళ్లిన అమానుష ఘటన స్థానికులను గ్భ్రాంతికి గురిచేసింది. వివరాల్లోకి వెళ్తే, శ్రీధర్ అనే వ్యక్తి గత కొంతకాలంగా రెండు కిడ్నీలు పాడై తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆర్థిక పరిస్థితి సహకరించకో లేక సేవ చేసే ఓపిక లేకనో తెలియదు కానీ, అతని కుటుంబ సభ్యులు అత్యంత దారుణమైన నిర్ణయం తీసుకున్నారు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న శ్రీధర్‌ను బతికించుకోవాలని చూడాల్సింది పోయి, ఇక చనిపోతాడనే భావనతో అమానవీయంగా పట్టణంలోని స్మశానవాటికలో పడవేసి వెళ్ళిపోయారు. కనీసం మానవత్వం లేకుండా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని అలా వదిలేయడం స్థానికంగా పెను దుమారం రేపింది. నిజానికి, ఆధునిక సమాజంలో మనుషుల మధ్య మమతలు ఎంతలా మంటగలుస్తున్నాయో చెప్పడానికి ఈ ఘటనే నిదర్శనం. ఆసుపత్రి బెడ్‌పై ఉండాల్సిన వ్యక్తిని, అనాథలా శ్మశానానికి చేర్చడం వెనుక ఉన్న కర్కశత్వం చూసి సభ్య సమాజం ముక్కున వేలేసుకుంటోంది. ప్రాణం పోయే వరకు కూడా కళ్ళల్లో వత్తులు వేసుకుని కాపాడాల్సిన కన్నప్రేమ, ఇక్కడ కాలయముడిగా మారింది. కనీసం అంతిమ సంస్కారాల దాకైనా ఆగలేని ఈ తొందరపాటు, మానవ సంబంధాలలోని డొల్లతనాన్ని ఎత్తిచూపుతోంది. అయితే, స్మశానవాటికలో ఎవరో మూలుగుతున్న శబ్దాన్ని విన్న స్థానికులు అక్కడికి వెళ్లి చూడగా, దీన స్థితిలో ఉన్న శ్రీధర్ కనిపించాడు. మానవత్వం ఇంకా చావలేదని నిరూపిస్తూ స్థానికులు తక్షణమే స్పందించి అతనికి నీళ్లు అందించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం అతడిని హుటాహుటిన చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం శ్రీధర్ పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కన్నవారిని కడదాకా కాపాడాల్సిన కుటుంబ సభ్యులే ఇలాంటి క్రూరమైన చర్యకు పాల్పడటం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమాజం ఎటువైపు వెళ్తోందని మేధావులు ప్రశ్నిస్తున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిస్సహాయ స్థితిలో ఉన్న వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నా రు. ఈ దారుణంపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సమాచారం. ఈ క్రూరత్వానికి పాల్పడిన వారిపై చట్టం తన పని తాను చేయాలని, అనాథలా మారిన శ్రీధర్‌కు మెరుగైన వైద్యం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ఇది ఫేక్, రివిజన్, ప్యాబ్రికేటెడ్ బడ్జెట్

## ఒక్కో కుటుంబంపై రూ.9 లక్షల అప్పుమోపారు

రైజింగ్ తెలంగాణ అంటే నిరుద్యోగంలో రైజింగ్ అవుతున్నాం. ఇది ఫేక్, రివిజన్, ప్యాబ్రికేటెడ్ బడ్జెట్ అని తెలంగాణ జాగృతి నేత కవిత అన్నారు. రైజింగ్ తెలంగాణ అంటే నిరుద్యోగంలో రైజింగ్ అవుతున్నాం. 56 శాతం జనాభా ఉన్న బీసీలకు ఇచ్చింది 4 శాతం నిధులే. తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించారని అన్నారు. ఎంబీసీ మినిస్ట్రీ, ఎంబీసీలో వెనుబడిన కులాలకు కార్పొరేషన్లు అన్నారు. ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ రాష్ట్రంలో గిరిజన మంత్రి లేని మొదటి ప్రభుత్వం ఇది. మైనార్టీ మంత్రి కూడా మొన్నటి వరకు లేదు. దీనిపై మేము పోరాటం చేస్తే అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇచ్చారు. కచ్చితంగా లంబాడా మినిస్టర్ ను కూడా నియమించాలని డిమాండ్ చేస్తున్నాంమని అన్నారు. ఇక 22 లక్షల 50 వేల ఇళ్లు కడతామని చెప్పి వాటికి 5,500 కోట్లు మాత్రమే కేటాయించారు. గతే బడ్జెట్ లో 12 వేల కోట్లు కేటాయిస్తే ఈ సారి 7 వేల కోట్లు తగ్గించారు. అందుకే ఇది విజన్ బడ్జెట్ కాదు. రీ విజన్ బడ్జెట్ మాత్రమే అంటున్నా. 20 వేల కోట్లు అప్పులు రీస్ట్రక్చర్ చేసుకునేలా చేశామని ముఖ్యమంత్రి గొప్పలు చెబుతున్నారు. కేంద్రం ఇచ్చే గ్రాంట్ దాదాపు 20 వేల కోట్లు అని గత బడ్జెట్ లో చెప్పారు. వచ్చింది మాత్రం 11 వేల 120 కోట్లు మాత్రమేనని అన్నారు.

## సన్నిధి రమేష్‌కు ఘన సత్కారం

**తిరుమలలో సన్నిధి శరభయ్య మఠం ఏర్పాటు చేయాలి....**

**యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి పూల వెంకటాద్రి యాదవ్ డిమాండ్...**

**రేణిగుంట :** కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి తొలి దర్శనం మరియు మలి దర్శనం ముగించుకున్న అనంతరం, సన్నిధి రమేష్ మామ ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి పూల వెంకటాద్రి యాదవ్, ధర్మవరం రాజన్న, గడ్డమడుగు రఘురామయ్య, లోకేష్ కలిసి రమేష్ మామ ని ఆత్మీయంగా పలకరించి, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.? సమితి జాతీయ కార్యదర్శి పూల వెంకటాద్రి యాదవ్ మాట్లాడుతూ, తిరుమలలో సన్నిధి శరభయ్య పేరిట ప్రత్యేకంగా ఒక మఠాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే టీటీడీ పాలకమండలిలో సన్నిధి యాదవులకు సంబంధించి ఒకరికి శాశ్వతంగా బోర్డు మెంబర్‌గా అవకాశం కల్పించాలని, ఈ మేరకు టీటీడీ బోర్డు తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. స్వామి వారి సేవలో తరతరాలుగా కొనసాగుతున్న యాదవుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం మరియు టీటీడీపై ఉందని ఆయన స్పష్టం చేశారు. భక్తిభావంతో పాటు సామాజిక హక్కుల సాధన దిశగా సాగిన ఈ భేటీ ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

## మీ ప్రత్యేకతను చూపినప్పుడే విజయం

**ప్రజాప్రయోజనమే లక్ష్యంగా పని చేయాలి**

**గ్రూప్- 1కు ఎంపికైన వారికి హైడ్రా కమిషనర్ దిశానిర్దేశం**

**హైదరాబాద్ :** 'ఎంతో కష్టపడి చదువుకుని గ్రూప్ - 1 ఉద్యోగాలకు ఎంపికయ్యారు. పలు శాఖల్లో అధికారులుగా మీరు విధులు నిర్వహించనున్నారు. మీనే మీ విభాగాల్లో ప్రత్యేకతను చాటాలి. అధికారులపై ప్రజలకు నమ్మకం కలిగేలా మీ చర్యలుండాలి. మీ ప్రతి చర్య పారదర్శకంగా ఉండాలి.. ప్రజాప్రయోజనమే లక్ష్యంగా ఉండాలి. ప్రజలకు పూర్తి అవగాహన ఉంటే.. పరిపాలన సులభమౌతుంది. వారి మద్ధతు కూడా సంపూర్ణంగా అందుతుంది. చరిత్రను ఫాలో అయి.. మీ విభాగాల్లో ఎవరికి వారు కొత్త చరిత్రను సృష్టించాలి ' అని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు అన్నారు. గ్రూప్ -1 కేడర్‌కు ఎంపికైన ఉద్యోగుల శిక్షణ కార్యక్రమంల భాగంగా శుక్రవారం డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో హైడ్రా కమిషనర్ మాట్లాడారు. హైడ్రా కార్యకలాపాలను వివరించారు. ఆదిలో హైడ్రా ఎదుర్కొన్న సవాళ్లను.. వాటిని అధిగమించిన తీరును తెలిపారు. హైడ్రా అంటే ప్రజల్లో పూర్తిగా అవగాహన రావడంతో తాము చేపట్టే కార్యక్రమాలకు పూర్తి స్థాయి మద్ధతు లభిస్తోందన్నారు. సామాజిక మాధ్యమాల్లో గమనిస్తే.. హైడ్రా అంటే ఆదిలో దాదాపు 70 శాతం నెగిటివిటీ కనిపించేది.. ఇప్పుడా శాతం రివర్స్ అయ్యిందన్నారు. 85 శాతం మంది హైడ్రా పట్ల సానుకూల దృక్పథంతో ఉన్నారన్నారు. ఇదంతా ప్రజలకు అర్థమయ్యేలా మన కార్యకలాపాలు సాగించడం.. గ్రౌండ్‌మీద ఫలితాలు చూపించడంతో సాధ్యమైందన్నారు.

## అట్టహాసంగా రాష్ట్రస్థాయి వృషభరాజముల బండలాగుడు పోటీలు

**కోడుమూరు :** పోటీలను ప్రారంభించిన మాజీ కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కోడుమూరు నియోజకవర్గ కేంద్రంలో శ్రీ శ్రీ శ్రీ వల్లెలాంబ దేవి తిరుణాల మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి,కోట్ల కళావతమ్మ జ్ఞాపకార్థం, రాష్ట్రస్థాయి వృషభరాజుల బండలాగుడు పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్ఈసీ సభ్యుడు, మాజీ కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ,కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ తో కలిసి ఈ పోటీలను ప్రారంభించారు. ముందుగా కోడుమూరు పాత బస్టాండ్‌లోని కోట్ల సర్కిల్ నుంచి వల్లెలాంభదేవి ఆలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. అనంతరం ఎద్దుల బండలాగుడు పోటీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర స్థాయి పోటీలు కావడంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు తరలి వచ్చి పోటీలను తిలకించారు. హోరాహోరీగా సాగుతున్న ఈ పోటీలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. పల్లె సంస్కృతి, సంప్రదాయాల ప్రతిబింబంగా ఈ పోటీలు నిలుస్తున్నాయి. ఈ సందర్భంగా కోట్ల హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి వ్యవసాయ రంగానికి అపార ప్రాధాన్యం ఇచ్చారని గుర్తుచేశారు. రైతుల సంక్షేమం కోసం ఆయన తీసుకున్న నిర్ణయాలు ఇప్పటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. అదే బాటలో వైయస్ జగన్ మోహన్ రెడ్డి కూడా రైతులకు అండగా నిలిచి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. డాక్టర్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ, గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడం ద్వారా సంప్రదాయాలను కాపాడుకోవడం ఎంతో అవసరమని చెప్పారు. రైతు కుటుంబాలకు ఉత్సాహం నింపే ఈ తరహా కార్యక్రమాలు సమాజానికి ఉపయోగకరమని అభిప్రాయపడ్డారు. మళ్లీ జగనన్న పాలన రావాలని ఆకాంక్షిస్తూ నాయకులు,కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు,భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ముస్లింలకు తోఫా పంపిణీ

**హన్మకొండ :** శుక్రవారం నాడు మైనార్టీ కాలనీ మసీద్ మరియు ఖేల్ మహీంద్రా నగర్ మసీద్ మరియు దేశ పేట మసీదుల దగ్గర గిఫ్ట్ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగినది. పవిత్ర మాసం రంజాన్ పండుగ సందర్భంగా ఈద్ ముబారక్ శుభాకాంక్షలు రూపకంలో ఈద్ క తోపా కిట్ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో 12వ డివిజన్ అధ్యక్షులు బాసాని కరుణాకర్, మహిళా అధ్యక్షురాలు దత్తా నీరజ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జూలూరి శ్రీధర్ గౌడ్, డివిజన్ మైనారిటీ అధ్యక్షులు మహమ్మద్ గౌస్ మైనార్టీ కాలనీ మహ్మదాన్వర్ కాజా మియా , షేక్ అబ్దుల్ రషీద్, మహమ్మద్ సద్దాం, బియ్యబాని, షేక్ అమ్జద్ తదితరులు పాల్గొన్నారు

## మధు పార్క్ వాసుల అందోళన

**హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం మూసి రివర్ ఫ్రంట్ ను నిర్మించేందుకు ప్రతిష్టాత్మకంగా తీసుకోంది. మూసి రివర్ ఫ్రంట్ కు బఫెర్ జోన్ అనుకొని ఉన్న ఇళ్లకు నోటీసులు జారి చేసింది. ఇల్లు కోల్పోతున్న బాధితులు ఆందోళన బాట పట్టారు. మధు పార్క్ అపార్ట్మెంట్ వాసులు మూడు రోజుల రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ప్రజల జీవన హక్కులను చూడాలని అందుకు ప్రత్యామ్నాయ మార్గాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. మూసి సుందరికరణకు మేము అడ్డం కాదు మూసి ప్రక్షాళన చేయండి మా ఇళ్లను మాత్రం కూల్చివేయకండి మూసి ప్రక్షాణాలతో మమ్మల్ని రోడ్డుపాలు చేయొద్దంటూ ప్లే కార్డ్స్ పెట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్నారు మధుపర్ బ్రిడ్జ్ అపార్ట్మెంట్ వాసులు వెంటనే ఇల్లు కాల్చేయాలని అధికారుల నుంచి నోటీసులు అందాయని అందుకు నిరసనగా శాంతియుతంగా మధు పార్క్ రిడ్జ్ అపార్ట్మెంట్ ఎదురుగా చిన్న పెద్దలతో కలిసి ప్లేకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్నారు.

బిజినెస్

# ప్రపంచ ఆర్థిక మాంద్యం ముప్పు

## టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌కు బ్రిటిష్ ప్రభుత్వ నైట్‌హుడ్ పురస్కారం



భారత్-యూకే వ్యాపార సంబంధాలను బలోపేతం చేయడంలో విశేష కృషి చేస్తున్న టాటా గ్రూప్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌కు బ్రిటిష్ ప్రభుత్వం గౌరవ నైట్‌హుడ్‌ను ప్రదానం చేసింది. బుధవారం రాత్రి దిల్లీలోని బ్రిటిష్ హైకమిషనర్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు 'నైట్ కమాండర్ ఆఫ్ ది మోస్ట్ ఎక్సెలెంట్ ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్ (కేబీఈ)' పురస్కారాన్ని ప్రదానం చేశారు. 'యూకేలో టాటా గ్రూప్ దీర్ఘకాలంగా పెట్టుబడులు పెడుతోంది. దీని కార్యకలాపాలు వాహన, ఉక్కు, సాంకేతికత, వినియోగదారు రంగాల్లో విస్తరించి ఉన్నాయి. ఇది యూకేలో ఉద్యోగాలకు, అధునాతన తయారీ రంగానికి, స్వచ్ఛమైన సాంకేతికతల వైపు పరివర్తనకు మద్దతు ఇవ్వడంలో ముఖ్య పాత్ర పోషిస్తోంది. టాటా గ్రూప్ ఛైర్మన్‌గా, ఆయన అనేక సంవత్సరాలుగా యూకే-భారత వ్యాపార సంబంధాలకు, బ్రిటన్‌లో పెట్టుబడులకు విశేష కృషి చేశార'ని హైకమిషన్ తెలిపింది. బ్రిటన్ రాజు కింగ్ ఛార్లెస్-3 తరపున బ్రిటిష్ హైకమిషనర్ కామెరాన్ ఈ గౌరవ పురస్కారాన్ని చంద్రశేఖరన్‌కు ప్రదానం చేశారు. ఈ గౌరవం కేవలం తన ఒక్కడికే కాదని, టాటా గ్రూప్‌లోని సహోద్యోగులందరికీ చెందుతుందని చంద్రశేఖరన్ అన్నారు.

## 8 గంటల పాటు అనిల్ అంబానీని విచారించిన సీబీఐ



స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఇచ్చిన ఫిర్యాదు మేరకు రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్, పారిశ్రామికవేత్త అనిల్ అంబానీపై నమోదైన రూ.2,929 కోట్ల మోసం కేసుకు సంబంధించి సీబీఐ ఆయన్ను సుమారు 8 గంటల పాటు ప్రశి 98బ్నించింది. అనిల్ అంబానీ ఉదయం 10:15 గంటలకు సీబీఐ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. లాంఛనాలు పూర్తి చేసిన అనంతరం ఆయన్ను విచారణ బృందం వద్దకు తీసుకెళ్లారు. సాయంత్రం 6:15 గంటల సమయంలో ఆయన సీబీఐ కార్యాలయం నుంచి బయటకు వచ్చారు. ఇప్పటికే పలు కేసుల్లో సీబీఐ విచారణను ఎదుర్కొంటున్న అనిల్‌ను శుక్రవారం మరోసారి విచారణ నిమిత్తం పిలిచినట్లు అధికారులు తెలిపారు. 'రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్, అనిల్ అంబానీ, గుర్తు తెలియని ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఇతరులు నిందితులుగా ఉన్న రూ.2,929.05 కోట్ల బ్యాంకు మోసం కేసులో.. 2025 ఆగస్టు 21న కేసు నమోదైంది. దీనికి సంబంధించి దిల్లీలోని ప్రధాన కార్యాలయంలో విచారణ నిమిత్తం హాజరు కావాలని అనిల్‌కు సమన్లు జారీ చేశాం. ఆయన్ను సుమారు 8 గంటల పాటు విచారించాం. శుక్రవారం మరోసారి విచారణకు హాజరు రావాలని ఆదేశించామ'ని సీబీఐ అధికారులు తెలిపారు.





పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ సంక్షోభం ప్రపంచ ఆర్థిక మాంద్యానికి దారి తీయనుందని యాక్సిస్ బ్యాంక్ చీఫ్ ఎకనామిస్ట్, యాక్సిస్ కాపిటల్ గ్లోబల్ రీసెర్చ్ హెడ్ నీలకంఠ మిశ్రా హెచ్చరించారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ కొనసాగిస్తోన్న ఉద్రిక్తతలు వచ్చే నాలుగు వారాల పాటు ఇలాగే కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచ ఇంధన సరఫరాలో దాదాపు 7 శాతం మేర అంతరాయం ఏర్పడిందని వెల్లడించారు. ఇది కేవలం చమురు ధరల పెరుగుదల మాత్రమే కాకుండా నేరుగా ఇంధన కొరతకు దారితీస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన సరఫరాలో 4 శాతం నుండి 5 శాతం మేర అంతరాయం కలిగితేనే ప్రపంచ జీడిపిలోనూ 4 నుంచి 5 శాతం కోత పడే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతానికి కంపెనీల వద్ద ఉన్న నిల్వలకారణంగా అంతర్జాతీయ మార్కెట్లు కొంత స్థిరంగా ఉన్నప్పటికీ సరఫరా గొలుసులో ఇబ్బందులు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయని మిశ్రా పేర్కొన్నారు. ఇప్పటికే రియల్ ఎస్టేట్, వాహన తయారీ రంగాలు కీలక ముడిసరుకుల కొరతను ఎదుర్కొంటున్నాయని ఆయన గుర్తు చేశారు. గ్యాస్ కొరతతో సూరత్ టెక్స్‌టైల్ రంగంలో ఇబ్బందులు నెలకొన్నాయన్నారు. ఇది కేవలం ఇంధనానికే పరిమితం కాకుండా మొత్తం ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావం చూపుతోందని వివరించారు. ఆర్థిక నష్టం విపరీతంగా పెరిగి అంతర్జాతీయ ఆర్థిక మార్కెట్ల నుండి ఒత్తిడి పెరిగినప్పుడే యుద్ధంలో పాల్గొంటున్న దేశాలు వెనక్కి తగ్గే అవకాశం ఉందని మిశ్రా అభిప్రాయపడ్డారు. ఈ సంక్షోభం వల్ల కలిగే ఆర్థిక భారంతో అన్ని దేశాలు నష్టపోతాయని హెచ్చరించారు. అందుకే ఈ యుద్ధం సుదీర్ఘ కాలం కొనసాగకపోవచ్చని ఆయన అంచనా వేశారు. అయితే, కీలకమైన ఇంధన మౌలిక సదుపాయాలకు ఏదైనా నష్టం వాటిల్లితే మాత్రం పరిస్థితి మరింత దిగజారి.. జీడిపి రికవరీ ఆలస్యం అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

## భారత జిడిపి అంచనాలకు కోత




పశ్చిమాసియాలో నెలకొన్న సంఘర్షణల వల్ల వచ్చే ఏడాది కాలంలో డాలర్‌తో రూపాయి మారకం విలువ 95 స్థాయికి పడిపోవచ్చని గ్లోబల్ బ్రోకరేజ్ సంస్థ గోల్డ్‌మాన్ సాక్స్ తెలిపింది. మరోవైపు భారత వృద్ధి రేటు అంచనాలకు కోత పెట్టింది. ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా సంక్షయుక్తంగా కొనసాగిస్తోన్న యుద్ధోన్మాదం వల్ల నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతలతో వచ్చే ఆర్థిక సంవత్సరం 2026-27లో భారత జిడిపి అంచనాలను 7 శాతం నుంచి 6.4 శాతానికి కోత పెడుతూ హెచ్చరించింది. గతంలో కంటే ఇది 50 బేసిస్ పాయింట్లు తక్కువ. మరోవైపు ద్రవ్యోల్బణ అంచనాను 30 బేసిస్ పాయింట్లు పెంచింది. కరెంట్ అకౌంట్ లోటు (సిఎడి) 2025తో పోలిస్తే ఈ ఏడాది 0.8 శాతం పాయింట్లు పెరిగి జిడిపిలో 1.2 శాతానికి చేరుకోవచ్చని అంచనా వేసింది. వచ్చే ఏడాది కాలంలో అమెరికన్ డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ 95 స్థాయికి పడిపోవచ్చని ఆ సంస్థ చీఫ్ ఇండియా ఎకనామిస్ట్ శాంతను సేన్‌గుప్తా హెచ్చరించారు. ముఖ్యంగా హార్ముజ్ జలసంధి మూసివేత వంటి పరిస్థితుల వల్ల చమురు ధరలు బ్యారెల్‌కు 100 మార్కును తాకుతున్నాయన్నారు. ఇది భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడిని పెంచుతుందని ఆయన ఓ ఇంటర్వ్యూలో విశ్లేషించారు. గత 25 ఏళ్లలో ఎదురైన చమురు సంక్షోభాల కంటే ఇది భిన్నమైనదని శాంతను సేన్‌గుప్తా అభిప్రాయపడ్డారు. గతంలో చమురు ధరలు పెరిగినప్పుడు మధ్యప్రాచ్య దేశాల ఆదాయం పెరిగి.. తద్వారా భారత్‌కు ఎగుమతులు, రెమిటెన్స్‌ల రూపంలో మేలు జరిగేదన్నారు. కానీ.. ప్రస్తుత యుద్ధం నేరుగా ఆ ప్రాంతంలోనే జరుగుతుండటంతో అటు ఇంధన ధరల భారం పెరగడమే కాకుండా ఇటు మధ్యప్రాచ్య దేశాల ఆర్థిక వ్యవస్థలు కూడా దెబ్బతింటాయన్నారు. దీనివల్ల భారత్‌కు అందే ఎగుమతుల ఆర్డర్లు, నిధుల ప్రవాహం కూడా తగ్గిపోవడంతో దేశ ఆర్థిక వ్యవస్థకు రెండు వైపులా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆయన స్పష్టం చేశారు.

## పెరిగిన చమురు ధరలు




ఇరాన్ సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రంపై ఇజ్రాయిల్ దాడి చేసిన అనంతరం ప్రతీకారంగా ఇరాన్ మధ్యప్రాచ్యంలోని ఇంధన సదుపాయాలపై దాడి చేయడంతో చమురు ధరలు పెరిగిపోయాయి. బ్యారెల్‌కు 119 డాలర్లు దాటాయి. బ్రెంట్ ఫ్యూచర్స్ 6.02 డాలర్లు లేదా 5.6 శాతం పెరిగి బ్యారెల్‌కు 113.40 డాలర్ల వద్ద ఉంది. సెషన్ ప్రారంభంలో, బ్రెంట్ 11 డాలర్ల కంటే ఎక్కువ పెరిగి 119.13 డాలర్ల గరిష్ట స్థాయికి చేరుకుంది, ఇది మార్చి 9న తాకిన మూడున్నర సంవత్సరాల గరిష్ట స్థాయికి దగ్గరగా ఉంది. అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ 7 సెంట్లు లేదా 0.1 శాతం పెరిగి బ్యారెల్‌కు 96.39 డాలర్ల వద్ద ఉంది, అంతకుముందు దాదాపు 4 డాలర్లు పెరిగి 100.02 డాలర్ల వద్ద ట్రేడ్ అయింది. అలాగే మధ్యప్రాచ్య బెంచ్‌మార్క్ దుబారు, ఒమన్ ప్రీమియంలు ట్రేడ్ వర్గాలు బ్యారెల్‌కు సుమారు 65 డాలర్ల వద్ద ఆల్-టైమ్ గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. అమెరికా సెంట్రల్ బ్యాంక్ బుధవారం వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచామని ప్రకటించింది.

స్పోర్ట్స్

# జట్టులో చోటుకే దిక్కులేదు.. కెప్టెన్‌ను చేయాలా?



పాకిస్తాన్ పేస్ దళ నాయకుడిగా పేరొందిన షాహిన్ అఫ్రిదిపై విమర్శల వర్షం కురుస్తోంది. టీ20 ప్రపంచకప్-2026లో పేలవ ప్రదర్శన, వన్డే కెప్టెన్‌గా బంగ్లాదేశ్ చేతిలో ఘోర ఓటమి ఇందుకు తాజా కారణాలు. అంతర్జాతీయ టీ20 ఫార్మాట్లో ఇప్పటి వరకు 103 మ్యాచ్‌లు ఆడిన ఈ లెఫ్టార్మ్ పేసర్ 136 వికెట్లు కూల్చాడు. తద్వారా పాక్ తరపున పొట్టి క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా షాహిన్ అఫ్రిది కొనసాగుతున్నాడు. అయితే, గత కొంతకాలంగా అతడి ఆట మరీ దిగజారింది. ఇటీవల ముగిసిన టీ20 వరల్డ్‌కప్ టోర్నీలో మొత్తంగా ఎనిమిది వికెట్లు మాత్రమే తీయగలిగాడు.

**పదకొండేళ్ల తర్వాత**

ఇక ఆ తర్వాత బంగ్లాదేశ్ పర్యటనలో పాక్ వన్డే జట్టుగా బాధ్యతలు నిర్వర్తించిన షాహిన్ అఫ్రిది.. 2-1 తేడాతో పాక్ సిరీస్ కోల్పోవడంతో విమర్శల పాలయ్యాడు. దాదాపు పదకొండేళ్ల విరామం తర్వాత పాక్ బంగ్లాకు వన్డే సిరీస్ కోల్పోవడం ఇదే తొలిసారి కావడంతో విమర్శలు పదునెక్కాయి. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ మాజీ కెప్టెన్ రషీద్ లతీఫ్ సైతం షాహిన్ అఫ్రిది ఆట తీరుపై మండిపడ్డాడు.

**జట్టులో చోటుకే దిక్కులేదు**

"పాకిస్తాన్ టీ20, వన్డే జట్ల కెప్టెన్‌గా షాహిన్ అఫ్రిది ఉండాలని గతంలో క్యాంపెయిన్ నడిచింది. ఆ తర్వాత వన్డేలకు బదులు టీ20 జట్టుకు కెప్టెన్ అయితే చాలు అన్నారు. కానీ ఇప్పుడు వన్డే కెప్టెన్‌గా అతడు పూర్తిగా విఫలమయ్యాడు. నిజానికి పాక్ టీ20 జట్టులో అతడికి చోటు కూడా ఇవ్వొద్దు. ముఖ్యంగా తుదిజట్టులో ఉండే అర్హత అతడు కోల్పోయాడు. అతడి ఖేల్ ఖతమైపోయింది" అని రషీద్ లతీఫ్ షాహిన్ అఫ్రిదిపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టాడు.

**మామ అలా**

మరోవైపు.. బంగ్లాదేశ్ చేతిలో వన్డే సిరీస్ ఓటమి తర్వాత షాహిన్ అఫ్రిది మామ, మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది మాట్లాడుతూ.. సెలక్షన్ కమిటీపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. టీ20 ప్రపంచకప్, బంగ్లా సిరీస్‌లో ఓటముల నేపథ్యంలో విమర్శలకు సెలక్టర్లు అర్హులేనని తాను భావిస్తున్నట్లు తెలిపాడు. ఏ ఫార్మాట్‌కు ఎవరిని కెప్టెన్ చేయాలో తెలియదంటూ మండిపడ్డాడు. ఈ నేపథ్యంలో రషీద్ లతీఫ్ పైవిధంగా స్పందించడం గమనార్హం.

## 24 ఏళ్ల తర్వాత మ్యాచ్.. సంచలనం రిపీటయ్యేనా?



భారత మహిళల జట్టు సౌతాఫ్రికా గడ్డపై టెస్టు మ్యాచ్ ఆడనుండడం ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఎందుకంటే 24 ఏళ్ల కిందట మహిళల జట్టు సౌతాఫ్రికాలో ఏకైక టెస్టు మ్యాచ్ ఆడింది. ఆ మ్యాచ్‌లో భారత్ 10 వికెట్ల తేడాతో సంచలన విజయాన్ని అందుకుంది. మరి 2002లో అద్భుత విజయాన్ని నమోదు చేసిన టీమిండియా మహిళలు మరోసారి ఆ సీన్‌ను రిపీట్ చేస్తారా లేదా అన్నది చూడాలంటే డిసెంబర్ 20 వరకు ఆగాల్సిందే. ఈ నేపథ్యంలో క్రికెట్ సౌతాఫ్రికా శుక్రవారం భారత మహిళల జట్టు పర్యటనకు సంబం ధించిన వన్డేలు, ఏకైక టెస్టు మ్యాచ్‌కు సంబంధించి షెడ్యూల్ విడుదల చేసింది. సఫారీల పర్యటనలో తొలుత సౌతాఫ్రికా ఎమర్జింగ్ టీమ్‌తో హర్మన్ బృందం వార్మప్ మ్యాచ్ ఆడనుంది. ఆ తర్వాత డిసెంబర్ 9 నుంచి 15 మధ్య మూడు వన్డేలు, ఆ తర్వాత డిసెంబర్ 20 నుంచి 23 మధ్య ఏకైక టెస్టు మ్యాచ్ ఆడనుంది. ఈ సిరీస్‌కు ముందే టీ20 ప్రపంచకప్ సన్నాహకంగా వచ్చే నెలలో సౌతాఫ్రికాలో భారత మహిళల జట్టు ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనున్న సంగతి తెలిసిందే. మహిళల టీ20 ప్రపంచకప్ ఇంగ్లండ్ వేదికగా జూన్ 12 నుంచి జూలై 5 వరకు జరగనుంది. 2002లో మార్చి 19 నుంచి 22 వరకు పార్ల్ వేదికగా జరిగిన ఆనాటి మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌ను భారత్ 9 వికెట్ల నష్టానికి 404 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. భారత బ్యాటర్లలో అంజూ జైన్ (52), కెప్టెన్ అంజుమ్ చోప్రా (80), మిథాలీరాజ్ (55), హేమలతా కలా (64), మమతా మబెన్ (50) అర్ధసెంచరీలతో రాణించారు. ఆ తర్వాత దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 150 పరుగులకే కుప్పకూలింది. భారత బౌలర్లలో దీపా మరాతే 3 వికెట్లు తీయగా, నీతూ డేవిడ్ 2 వికెట్లు పడగొట్టింది. ఆ తర్వాత ఫాలోఆన్ ఆడిన సౌతాఫ్రికా జట్టు 266 పరుగుల వద్ద ఆలౌటైంది. జులన్ గోస్వామి, హేమలతా కలా చెరో 3 వికెట్లతో రాణించారు. ఆ తర్వాత 13 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని 1.3 ఓవర్లలో వికెట్లేమి నష్టపోకుండా ఛేదించి విజయాన్ని అందుకుంది.


సౌతాఫ్రికాలో భారత మహిళల జట్టు పర్యటన వివరాలు..

డిసెంబర్ 6: సౌతాఫ్రికా ఎమర్జింగ్ జట్టుతో వార్మప్‌మ్యాచ్
డిసెంబర్ 9: తొలి వన్డే, పోచెఫ్‌స్ట్రూమ్
డిసెంబర్ 12: రెండో వన్డే, బ్లోమ్‌ఫోంటైన్
డిసెంబర్ 15: మూడో వన్డే, కేప్‌టౌన్
డిసెంబర్ 20-23: ఏకైక టెస్టు మ్యాచ్, గెబెర్హా

## టెన్నిస్ చాలా కష్టంగా అనిపిస్తోంది.. ఓడిపోయానంటే నమ్మలేకపోతున్నా..!



మహిళల టెన్నిస్‌లో మరో సంచలనం. ఒకప్పుడు వరల్డ్ నంబర్ 1 ఇగా స్వియాటెక్ మియామి ఓపెన్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. శుక్రవారం జరిగిన ఓపెనింగ్ మ్యాచ్‌లో ఈ టాప్ సీడ్ అనూహ్యంగా ఓటమి పాలైంది. రెండు గంటల 10 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో పోలె మగ్ద లినెట్టే చేతిలో స్వియాటెక్ చిత్తైంది. ఫేవరెట్‌గా ఇంటర్ మియామి ఓపెన్‌లో బరిలోకి దిగిన ఇగా స్వియాటెక్‌కు భారీ షాక్ తగిలింది. తొలి రౌండ్‌లోనే ఘోర పరాజయం చవిచూసిందీ మూడో ర్యాంకర్. 50వ ర్యాంకర్ పోలె మగ్ద లినెట్టే తొలి సెట్ నుంచి జోరు చూపించి 6-1, 5-7, 6-3తో స్వియాటెక్‌కు చెక్ పెట్టింది. దాంతో, డబ్ల్యూటీఏ టూర్‌లో తొలి రౌండ్‌లో 73 విజయాల రికార్డుకు బ్రేకు వేసింది. ఊహించని పరాజయం అనంతరం మాట్లాడుతూ.. 'నేను ఓడిపోయానంటే నమ్మబుద్ధి కావడం లేదు. రాను రాను టెన్నిస్ ఆట కష్టంగా అనిపిస్తోంది . ఈ ఆట చాలా తేలిక అనుకున్నా. కానీ, కోర్టులో మానసికంగా మనం ఎలా ఉంటామనేది చాలా కీలకం. ఇది నాకొక చెత్త మ్యాచ్. ఈ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటా. మళ్లీ నా పనిలో మునిగిపోతా. ప్రాక్టీస్ చేస్తాను. పాజిటివ్‌గా ఆలోచిస్తూ.. నా ఆటను మెరుగుపరచుకుంటా' అని స్వియాటెక్ చెప్పింది.




# కొరియన్ మ్యూజిక్ స్టార్ట్..

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ కొరియన్ కనకరాజు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రం హర్రర్, కామెడీని రిఫ్రెషింగ్ క్రాస్-కల్చరల్ ట్విస్ట్‌తో బ్లెండ్‌తో తెరకెక్కుతోంది. ఇండియన్, కొరియన్ నేపథ్యాలలో రూపొందుతున్న ఈ చిత్రంలో వరుణ్ తేజ్ ఇంతకు ముందు ఎన్నడూలేని భిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. ఇదిలా ఉంటే.. రీసెంట్‌గా టీమ్ ఫైనల్ షెడ్యూల్ అప్డేట్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ షెడ్యూల్‌లో పాటలు, కథలో ముఖ్యమైన కొన్ని సన్నివేశాలను చిత్రీకరించనున్నారని, వరుణ్ తేజ్, రితికా నాయక్, సత్య పాల్గొనున్న ఈ షెడ్యూల్‌ను కొరియాలోని అద్భుతమైన ప్రదేశాల్లో చిత్రీకరించనున్నారని తెలిపారు. ఇక ఉగాది పండుగ సందర్భంగా మరో అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మేరకు వరుణ్ రేడియో పట్టుకున్న ఫొటోను షేర్ చేస్తూ.. 'కొంచెం తీపి, కొంచెం కారం, ఇంకా బోలెడంత స్వాగ్.. ప్రతి రుచితో నిండిన ఒక అద్భుతమైన బ్లాక్‌బస్టర్‌తో కనకరాజు త్వరలో వెండితెరపైకి రాబోతున్నారు' అని తెలిపారు. ఇక రిలీజ్ చేసిన పోస్టర్ ఆధారంగా త్వరలోనే మ్యూజికల్ జర్నీ స్టార్ట్ కాబోతున్నట్లు హింట్ ఇచ్చారు చిత్ర బృందం.

# 'ఒక్క యాంగిల్లోనూ ఫేస్ మ్యాచ్ అవ్వట్లేదే'.. ఆసక్తిగా ట్రైలర్

స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ హీరోగా వస్తోన్న లేటేస్ట్ మూవీ హ్యాపీరాజ్. ఈ చిత్రానికి మరియా రాజా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీలో తెలుగమ్మాయి శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ సినిమాను బియాండ్ పిక్చర్స్ బ్యానర్‌పై జైవర్ధ నిర్మించారు. ఈ మూవీతోనే సీనియర్ హీరో అబ్బాస్ రీ ఎంట్రీ ఇస్తున్నారు. -తాజాగా ఈ సినిమా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ట్రైలర్ చూస్తుంటే ఫుల్ ఫ్యామిలీ అండ్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఓ పెద్దింటి అమ్మాయిని మిడిల్ క్లాస్ అబ్బాయి లవ్ చేస్తే వచ్చే సమస్యలు ఏంటనే కోణంలో తీసినట్లు అర్థమవుతోంది. ముఖ్యంగా సీనియర్ హీరో అబ్బాస్ నటించడం ఈ సినిమాకు మరింత ప్లస్ కానుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ చిత్రం మార్చి 27న థియేటర్లలో సందడి చేయనుంది. ఈ సినిమాకు జస్టిన్ ప్రభాకరన్ సంగీతమందించారు.






# క్రికెట్, క్రైమ్, పాతబస్తీ.. ఇంట్రెస్టింగ్‌గా సుధీర్ బాబు 'గల్లీ' ఫస్ట్ లుక్

టాలెంటెడ్ హీరో సుధీర్ బాబు డిజిటల్ ఎంట్రీ ఇస్తూ నటిస్తున్న సరికొత్త వెబ్ సిరీస్ 'గల్లీ' అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా రాబోతున్న ఈ సిరీస్‌ను ప్రవీణ్ సత్తారు దర్శకత్వం వహిస్తుండగా 'బాహుబలి' వంటి భారీ చిత్రాలను నిర్మించిన ఆర్కా మీడియా వర్క్స్ నిర్మిస్తోంది. హైదరాబాద్‌లోని పాతబస్తీ గల్లీల నేపథ్యంలో ఒక 'మోడరన్-డే వెస్ట్రన్' డ్రామాగా ఈ కథను రూపొందించారు. ఒక హై-స్టేక్స్ గల్లీ క్రికెట్ మ్యాచ్ జరగడానికి ముందు రోజు రాత్రి చోటుచేసుకునే ఉత్కంఠభరిత పరిణామాలు, నేరస్థులు, పోలీసులు మరియు ఆటగాళ్ల మధ్య సాగే దోబూచులాట ఈ సిరీస్‌కు ప్రధాన ఆకర్షణ. ఇందులో సుధీర్ బాబు మునుపెన్నడూ చూడని విధంగా చాలా రఫ్ అండ్ మాస్ లుక్‌లో కనిపించబోతున్నారు. ఆయనతో పాటు సీనియర్ నటుడు జె.డి. చక్రవర్తి, హన్సిక మోట్వానీ, శ్రద్ధా శ్రీనాథ్, ఆదర్శ్ బాలకృష్ణ వంటి భారీ తారాగణం ఈ సిరీస్‌లో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. క్రికెట్ వెనుక ఉన్న గ్యాంగ్‌స్టర్ డ్రామాను ప్రవీణ్ సత్తారు తనదైన శైలిలో ఆవిష్కరిస్తున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ త్వరలోనే స్ట్రీమింగ్ కాబోతుంది.



# నోరా ఫతేహీపై ఫత్వా.. అశ్లీల సాహిత్యంపై మత పెద్దల అభ్యంతరం

కన్నడ చిత్రం 'కేడీ: ద డెవిల్'లోని 'సర్కే చునార్ తేరి సర్కే' పాట తీవ్ర వివాదాలకు దారితీసిన సంగతి తెలిసిందే. అయితే ఈ పాటలో నటించిన బాలీవుడ్ నటి నోరా ఫతేహీపై అలీగఢ్‌కు చెందిన ముస్లిం పర్సనల్ దారుల్ ఇఫ్తా అనే మతపరమైన సంస్థ ఫత్వా జారీ చేసింది. ఈ పాటలోని సాహిత్యం ఇస్లామిక్ బోధనలకు విరుద్ధంగా ఉందని సదరు సంస్థ పేర్కొంది. ఇటువంటి ప్రదర్శనలు సమాజంలో తప్పుడు సందేశాన్ని పంపుతాయని, ముఖ్యంగా ముస్లిం యువతను తప్పుదోవ పట్టిస్తాయని వారు తమ ఫత్వాలో పేర్కొన్నారు. మరోవైపు ఈ పాటకు దేశవ్యాప్తంగా వస్తున్న నిరసనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ పాటపై నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో ఈ విషయాన్ని ధృవీకరించారు. మరోవైపు ఈ వివాదంపై నోరా ఫతేహీ స్పందిస్తూ.. ఈ పాట హిందీ వెర్షన్‌లో తనకేమీ సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు. మూడేళ్ల క్రితం సంజయ్ దత్ వంటి దిగ్గజ నటుడితో కలిసి నటించే అవకాశం రావడం, అలాగే ఇది 'నాయక్ నహీ ఖల్ నాయక్ హూ మై' వంటి ఐకానిక్ సాంగ్ రీమేక్ అని భావించి తాను అంగీకరించానని తెలిపారు. తనకు కన్నడ భాష తెలియదని, మేకర్స్ చెప్పిన అనువాదం అప్పట్లో అభ్యంతరకరంగా అనిపించలేదని ఆమె వివరణ ఇచ్చారు. ధ్రువ సర్జా హీరోగా, ప్రేమ్ దర్శకత్వంలో 1970ల నాటి బెంగళూరు నేపథ్యంతో తెరకెక్కిన 'కేడీ: ద డెవిల్' చిత్రం ఏప్రిల్ 30న విడుదల కానుంది.

ఫత్వా జారీ చేస్తే ఏం అవుతుంది.?

ఇస్లామిక్ పండితులు ఆధారంగా ఏదైనా ఒక విషయంపై ఇచ్చే వివరణే ఫత్వా. ఉదాహరణకు ఒక పాట లేదా సినిమా ఇస్లామిక్ నియమాలకు వ్యతిరేకంగా ఉందని వారు భావిస్తే, దానిని చూడకూడదని లేదా అది తప్పు అని ఫత్వా ఇస్తారు. అయితే ఫత్వాను గౌరవించి, సదరు వ్యక్తిని లేదా విషయాన్ని దూరం పెట్టే అవకాశం ఉంటుంది. దీనివల్ల వ్యక్తుల ప్రతిష్టకు భంగం కలగడం లేదా వారు సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుంది. అయితే భారత్ వంటి ప్రజాస్వామ్య దేశాల్లో ఫత్వాకు ఎటువంటి చట్టపరమైన గుర్తింపు లేదు. ఫత్వా జారీ చేసినంత మాత్రాన పోలీసులు ఎవరినీ అరెస్టు చేయలేరు లేదా కోర్టులు దానిని తీర్పుగా పరిగణించవు. రాజ్యాంగం ప్రకారం దేశ చట్టాలే అత్యున్నతమైనవి

# 'క్రేజీ కల్యాణం' నుంచి ఫస్ట్ లుక్

నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'క్రేజీ కల్యాణం'. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసమ్ జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. ఈ రోజు ఉగాది పండుగ సందర్భంగా 'క్రేజీ కల్యాణం' మూవీ నుంచి యంగ్ హీరో అఖిల్ రాజ్ ఉడ్డెమారి నటించిన ఉదయ్ క్యారెక్టర్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో అఖిల్ రాజ్ ట్రెడిషనల్ వేర్‌లో హ్యాపీగా డ్యాన్స్ చేస్తూ కనిపిస్తున్నారు. పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో కంప్లీట్ ఎంటర్‌టైన్మెంట్‌తో సాగే చిత్రమిది. తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో "క్రేజీ కల్యాణం" సినిమా చిత్రీకరణ జరిపారు. ఈ సినిమాకు సురేష్ బొబ్బిలి సంగీతాన్ని అందిస్తున్నారు.





# క్లాస్ దర్శకుడితో వైష్ణవ్ తేజ్ మూవీ

పంజా వైష్ణవ్ తేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఉప్పెన చిత్రంతో హీరోగా ఎంట్రీ ఇచ్చిన ఈ నటుడు మొదటి చిత్రంతోనే భారీ విజయాన్ని అందుకున్నాడు. ఈ సినిమా 100 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించడంతో ఒక్కసారిగా ఈయన ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించాడు. మొదటి సినిమాతో వచ్చిన గుర్తింపు ఆ తర్వాత ఆయనకు రాలేదు. క్రిష్ దర్శకత్వంలో వచ్చిన కొండపొలం ఫెయిల్యూర్ అయింది. కానీ ప్రయోగాత్మక చిత్రంగా నిలిచింది. తర్వాత వచ్చిన ఫ్యామిలీ ఎంటర్టైనర్ రంగ రంగ వైభవంగా కూడా ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేదు. ఇక చివరగా వచ్చిన మాస్ మూవీ ఆది కేశవ డిజాస్టర్‌గా నిలిచింది. వరుసగా మూడు ఫ్లాప్స్ రావడంతో వైష్ణవ్ తేజ్ నెక్స్ట్ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. ఇప్పటివరకు ఆయన కొత్త సినిమాపై స్పష్టమైన అప్‌డేట్స్ రాలేదు. తాజాగా ఈ యంగ్ హీరో నెక్స్ట్ మూవీకి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. "35 చిన్న కథ కాదు" సినిమాతో ప్రశంసలు అందుకున్న నంద కిషోర్ ఏమాని దర్శకత్వంలో వైష్ణవ్ తేజ్ ఓ సినిమా చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ దర్శకుడు వైష్ణవ్ కోసం ప్రత్యేకంగా కథను సిద్ధం చేస్తున్నట్లు టాక్. అన్నీ అనుకున్నట్టు జరిగితే వీరి కాంబినేషన్‌లో ఓ మంచి ప్రాజెక్ట్ రావచ్చని సినీ వర్గాలు చెబుతున్నాయి.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com